పెరుగుతున్న కరోనా కేసులు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ బాలికకు గురువారం పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో మూడు నుంచి ఐదు రోజులపాటు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి వంటి వాటితో ఇబ్బందిపడుతున్నట్టయితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వెల్లడించారు. కొవిడ్ అనుమానిత లక్షణాలతో బాధపడే వారు ఐసోలేట్ కావాలని సూచిస్తున్నారు.

ఆర్థిక సాయం ఇప్పించాం...

ప్లాంటును నడపాల్సింది వారే

ప్లాంటుపై దుష్ప్రచారం చేయాలనే ఆలోచన ఉంటే కేంద్రం కాళ్లు పట్టుకుని నిధులు ఎందుకు తెస్తాం

- ప్రతి ఒక్కరూ పని చేయాలని చెబితే కొందరికి రుచించడం లేదు
- పనిచేయకుండా చాలామంది జీతాలు తీసుకున్నారు
- కేంద్ర నిధులను జీతాలకు వాడేస్తే ప్లాంటు పరిస్థితి ఏమిటి
- రెండేళ్లు 100 శాతం ఉత్పత్తి చేసి, లాభాలు చూపిస్తే సెయిల్‌లో విలీనం చేయిస్తాం
- అవసరాన్ని బట్టే కాంట్రాక్టు వర్కర్ల నియామకం, తొలగింపు
- నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత మాపై ఉంది
- పీఎస్‌యూలలో రాజకీయ జోక్యం తగదు...కోరుకోకూడదు
- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు, యాజమాన్యం నిర్ణయాన్ని నిరసిస్తూ వారు చేసిన సమ్మెపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కార్మిక వర్గాల్లో చర్చకు దారితీశాయి.

నిర్వాసితులకు అండగా ఉంటానని, ఘోస్ట్ కార్మికులను తొలగిస్తే నష్టం ఏమిటని, యు-కార్డుదారులతో ఆర్థిక భారం పెరిగిందంటూ ఆయన నోటి నుంచి వెలువడిన మాటలు...స్టీల్ ప్లాంటు కార్మిక వర్గాల్లో సెగ పుట్టించాయి. స్టీల్‌ప్లాంటుపై ఎమ్మెల్యే దుష్ప్రచారం చేస్తున్నారని, కార్మికులను నిర్వాసితులు, కాంట్రాక్టు వర్కర్లు అంటూ విభజించి మాట్లాడుతున్నారని ఆయా సంఘాల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అవే అంశాలను ఆయన వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించింది. స్టీల్‌ప్లాంటుపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు.


ప్రశ్న: స్టీల్‌ప్లాంటుపై మీరు దుష్ప్రచారం చేస్తున్నారనే వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారు?

జవాబు: ఈ ప్రాంత ప్రజలకు అన్నం పెడుతున్న పరిశ్రమపై దుష్ప్రచారం చేయాలనే ఆలోచన ఉంటే...కేంద్రం కాళ్లు పట్టుకొని రూ.11,440 కోట్లు ఎందుకు తెస్తాం?, రాష్ట్ర ప్రభుత్వంతో రూ.2,100 కోట్లు ఎందుకు ఇప్పిస్తాం?. ప్లాంటు మనుగడ కోసం 'ప్రతి ఒక్కరూ'

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- అర నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఉమ్మడి జిల్లా అభ్యర్థుల కోసం 12 పరీక్షా కేంద్రాలు
- డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- మొత్తం పోస్టులు 1,139, అభ్యర్థులు 57,895



విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి డీఎస్సీ రాత పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 7, 15 తేదీల్లో మినహా నెలాఖరు వరకూ ప్రతి రోజు రెండుపూటలా పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలి. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ప్రతి అభ్యర్థి పరీక్షహాలులో ఉండాలి. అర నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలకు అనుమతించరు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,139 పోస్టులకు 57,895 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న పరీక్షలకు మొత్తం 12 (కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, పెదగంట్యాడలో ఎస్‌వీఎస్ టెక్నాలజీ సొల్యూషన్స్, షీలానగర్, చినముషిడివాడల్లో ఐయాన్ డిజిటల్స్, ఎన్ఎస్‌టీఎల్ సమీపాన గల ఏడీజడ్ ఆర్యోనా డిజిటల్, మధురవాడ, రుషికొండల్లోని గాయత్రి విద్యాపరిషత్, దువ్వాడ,

... మిగతా 6వ పేజీలో

ఉల్టా...పల్టా

జీవీఎంసీలో తారుమారైన అధికార, ప్రతిపక్ష హోదాలు

నేడు కౌన్సిల్ సమావేశం

- మేయర్‌గా పీలా ఎన్నికైన తర్వాత ఇదే మొదటి సమావేశం
- వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను ఎండగట్టాలని కూటమి యోచన
- నైట్‌ఫుడ్‌కోర్ట్, ఆస్తిపన్ను తగ్గింపు హామీపై నిలదీయాలని వైసీపీ నిర్ణయం



సిద్ధమైన కౌన్సిల్ హాలు. (ఇన్‌సెట్‌లో) మేయర్ పీలా శ్రీనివాసరావు

- కూటమిలోనే కొందరు సభ్యులు విపక్షంగా వ్యవహరించే అవకాశం
- 27 అంశాలతో అజెండా
- టేబుల్ అజెండాగా మరికొన్ని...

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనున్నది. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడం, అంతేకాకుండా కౌన్సిల్‌లో ఇంతవరకూ విపక్షంగా ఉన్న కూటమి అధికారపక్షంగా, అధికారపక్షమైన వైసీపీ విపక్షంగా వ్యవహరించనుండడంతో అందరిలోనూ ఒకింత ఆసక్తి నెలకొంది.

మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సిల్ సమావేశం కోసం ఇప్పటికే 27 అంశాలతో అజెండాను తయారుచేసి సభ్యులకు అందజేశారు. టేబుల్ అజెండాగా మరికొన్ని అంశాలను కౌన్సిల్‌లో చర్చకు పెట్టే అవకాశం ఉంది. వైసీపీ హయాంలో జీవీఎంసీలో జరిగిన అవినీతి, అక్రమాలను కూటమి సభ్యులు సభలో బయటపెట్టే అవకాశం ఉంది. మరోవైపు వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆ పార్టీ కార్పొరేటర్లంతా గురువారం షాడో మీటింగ్ ఏర్పాటు చేసుకుని కౌన్సిల్‌లో ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించారు. ఎన్నికల సమయంలో ఆస్తి పన్ను తగ్గింపుపై కూటమి నేతలు హామీ ఇచ్చారని, దానిని నెరవేర్చాలని డిమాండ్ చేయాలని నిర్ణయించారు. అలాగే పాతజైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్ట్‌కు జీవీఎంసీ అనుమతి లేకపోయినా వైసీపీ నేతలే వెనకుండి కొనసాగించారని కూటమి నేతలు గతంలో ఆరోపించారని, ఇప్పుడు వారే అధికార పక్షంగా ఉన్నందున తక్షణం దానిని తొలగించాలని డిమాండ్ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అదే విధంగా దాదాపు ఐదు నెలలుగా జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించకపోవడాన్ని నిరసిస్తూ ప్లకార్డులతో నిరసన తెలపాలని నిర్ణయించినట్టు సమాచారం.

మరోవైపు కూటమి పార్టీలకు చెందిన కొందరు కార్పొరేటర్లు సైతం కౌన్సిల్‌లో ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఆరు నెలల తర్వాత జరుగుతున్న కౌన్సిల్ సమావేశంలో తమ వార్డులకు సంబంధించిన అనేక అభివృద్ధి పనుల ఆమోదానికి ప్రతిపాదిస్తే వాటిని అజెండాలో చేర్చకపోవడంతో కొందరు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కార్పొరేటర్లు కోడివ్యర్థాల టెండర్లు, కాంట్రాక్టర్ల నుంచి లంచాలు

... మిగతా 6వ పేజీలో



తెన్నేటి పార్కు వద్ద వర్షం

ఎండ..వాన

- మధ్యాహ్నం వరకూ నిప్పులకొలిమిలా మారిన నగరం
- ఎయిర్‌పోర్టులో 38.4 డిగ్రీలు
- మూడు గంటల తరువాత ఈదురుగాలులతో వర్షం
- అది కూడా మద్దిలపాలెం నుంచి మధురవాడ వరకే...
- జాతరలో 54.25 మి.మీ.వర్షపాతం



విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం భిన్న వాతావరణం నెలకొంది. తూర్పు, ఈశాన్య భాగాల్లో వర్షం కురవగా, మిగిలిన ప్రాంతాల్లో ఎండ కొనసాగింది. మద్దిలపాలెం నుంచి మధురవాడ వరకూ ఈదురుగాలులతో వర్షం కురిసింది. అనేకచోట్ల చెట్లు నేలకొరిగాయి. గడచిన మూడు, నాలుగు రోజుల నుంచి నగరంలో తీవ్రమైన ఎండ, ఉక్కపోత కొనసాగుతున్నాయి. గురువారం కూడా ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంది. కొద్దిసేపు వడగాడ్పులు వీచాయి. మధ్యాహ్న సమయానికి నగరం నిప్పులకొలిమిలా మారింది. ఫ్యాన్‌ల కింద కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఎయిర్‌పోర్టులో 38.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే

... మిగతా 6వ పేజీలో



ఎంవీపీ కాలనీ సెక్టర్-2లో నేలకొరిగిన వృక్షం

పాఠశాలలకు విద్యార్థి కిట్లు

కిట్‌లో బ్యాగ్, యూనిఫారం క్లాత్, షూ, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు...



ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అందజేయనున్న బ్యాగులు, యూనిఫాం

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

- స్కూళ్లు తెరిచే రోజున పంపిణీ
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 72,727 మంది...

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎనిమిది వస్తువులతో కూడిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు జిల్లాలకు చేరాయి. వాటిని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. స్టూడెంట్ కిట్‌లో బ్యాగ్, మూడు జతల యూనిఫారం కోసం క్లాత్, షూ, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ లేదా పిక్టోరియల్ డిక్షనరీ, బెల్టు ఉంటాయి.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ బాలురు 33,930 మంది, బాలికలు 38,697 మంది... మొత్తం 72,627 మంది ఉన్నారు. విశాఖ రూరల్ (చినగదిలి)లో 12,475మంది, గోపాలపట్నం మండలంలో

... మిగతా 6వ పేజీలో

వచ్చే నెల 9,10 తేదీల్లో

సింహగిరి ప్రదక్షిణ

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు
- భక్తులు జాతీయ రహదారి దాటే చోట తాత్కాలికంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు
- కొండ దిగువన తొలి పావంచా వద్ద పోలీస్ బందోబస్తు
- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- 9 మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభం: ప్రధాన అర్చకులు



సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల తొమ్మిది, పది తేదీల్లో సింహగిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉంటుందని, అందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలన్నారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భక్తుల గిరి ప్రదక్షిణకు, స్వామి వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులు జాతీయ రహదారి దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్, సీపీ శంఖబ్రతబాగ్చీ అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి ఎన్‌హెచ్ఏఐ అధికారులను సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయాలని, గాలి, వానలకు ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. తొమ్మిదో తేదీ తెల్లవారుజాము

... మిగతా 6వ పేజీలో

వెంకోజీపాలెం సర్వీస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వెంకోజీపాలెం జంక్షన్ నుంచి ఇసుకతోట జంక్షన్ వరకూ సర్వీస్ రోడ్డులోని ఆక్రమణల తొలగింపునకు జీవీఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు పూర్తిగా ఆక్రమణకు గురవ్వడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. సర్వీస్ రోడ్డుపై పాత ఇంటి సామగ్రి, ఇతర సామగ్రి పెట్టిన వారి దుకాణాల వద్దకు వెళ్లి వాటిని తొలగించాలని గురువారం ఆదేశించారు. వారు స్పందించకపోవడంతో జీవీఎంసీ సిబ్బందే గూడ్స్ ఆటోల్లో సామగ్రిని అక్కడ నుంచి తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గురువారం కొంతవరకూ తొలగించారు. మిగిలిన వాటిని శుక్రవారం తొలగించాలని భావిస్తున్నారు. అయితే ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు మొదలైనట్టు తెలిసింది. వాటిని అధిగమించి ఆక్రమణలు తొలగిస్తారా?, లేక ఒత్తిళ్లకు తలొగ్గుతారా?...అనేది వేచి చూడాల్సిందే.



విశాఖకు 'సత్వా'?

- హిల్ నంబరు 4పై 25 ఎకరాలు కేటాయించే అవకాశం
- భారీ భవనాలను నిర్మించి ఐటీ సంస్థలకు అందించనున్న కంపెనీ
- 10న సిరిపురంలో టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నానికి మరో పెద్ద కంపెనీ రానుంది. ఇది రహేజా వంటి సంస్థల్లా భారీ భవనాలు నిర్మించి ఐటీ సంస్థలకు అందిస్తుంది. దీని పేరు 'సత్వా'. దేశంలో పెద్ద సంస్థల్లో ఒకటిగా పేరు ఉంది. విశాఖపట్నంలో కో వర్కింగ్ స్పేస్ భవనాలు నిర్మించడానికి ఆసక్తి చూపుతోంది. భూమి కేటాయిస్తే భవనాలు నిర్మిస్తామని ప్రతిపాదించింది. అన్నీ పరిశీలించిన కమిటీ కేబినెట్ ముందు పెట్టనుంది. మధురవాడ హిల్ నంబర్ 4పై (అదానీకి కేటాయించిన కొండ) 25 ఎకరాలు కేటాయించే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది.

10న టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన ఐకానిక్ భవనం 'ది డెక్'లో ఒక అంతస్తు టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుతం అందులో ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. ఆ హబ్‌ను సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పదో తేదీన ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు

... మిగతా 6వ పేజీలో



9వ వార్డులో మాట్లాడుతున్న జడ్సీ కనకమహాలక్ష్మి


వైఎంసీఏ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్సీ అయ్యప్పనాయుడు



మొక్క నాటిన హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు
» నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా పర్యావరణ దినోత్సవం

భీమునిపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని భీమిలి వైఎంసీఏ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రజలు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ రీజనల్ వైస్ ఛైర్మన్ కెఎస్ఎం సుధాకర్, సభ్యులు ఆల్బర్ట్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేపలుప్పాడ తీరం వద్ద ఐఎన్ఎస్ కళింగ భీమిలి నేవల్ స్టేషన్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. లైట్ హౌస్ తీరంలో వైఎంసీఏ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మెజిస్ట్రేట్ డి.సౌజన్య కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. భీమిలి ఎన్ఓఎస్, ఎఫ్ఎస్పీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఇళ్లకు, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు కె. దుర్గారాజ్, ఎస్బి గౌరి, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో వార్డులో...

విశాలాక్షినగర్ : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జోన్ - 2 కమిషనర్ కనకమహాలక్ష్మి పిలుపునిచ్చారు. 9వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం జోడుగుళ్లపాలెం పార్కులో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, కూటమి నాయకులు బుడుమూరి గోవింద్, సుజాత, చిన్నారావు, భూలక్ష్మి, పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో...

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా , సైన్స్ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్, జీవశాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐదో వార్డులో...

కొమ్మాది : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలు పూర్తిగా నిషేధించినప్పుడే పర్యావరణం మెరుగుపడుతుందని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డు పరిధిలోని రైతుబజార్‌లో జోన్-2 కమిషనర్ కె. కనకమహాలక్ష్మితో కలిసి ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, ఏఎంహెచ్ఓ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దివీస్ కర్మాగారం ఆధ్వర్యంలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని చిప్పాడలో దివీస్ కర్మాగారం సిబ్బంది ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. దేవేందరరావు ప్రారంభించారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎల్వీ రమణ, ఉద్యోగులు ఎర్రయ్యపాలెం బీచ్‌లో చెత్త తొలగించి, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు కోటేశ్వరరావు, బాలాజీ, రామకృష్ణ, సుబ్బారావు సీనియర్ మేనేజరు ప్రసాద్, సీఎస్ఆర్ మేనేజరు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎండాడలో...

ఎండాడ : పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 8వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్ఓ కిషోర్, చెట్టుపల్లి గోపి, శ్రీనివాస్, పరమేష్, మంగాదేవి, పాల్గొన్నారు.

సింహాచలంలో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల కూడలి నుంచి గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా సింహాచలం ప్రధాన కూడలి వరకు ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహాచలం ప్రధాన కూడలిలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహం, జోన్-8 శానిటరీ సూపర్‌వైజర్ రమణ, జేడీ ఫౌండేషన్ ప్రతినిధి కారుమూడి అను, 98వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని వేములవలసలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఎంపీ సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకరరెడ్డి, నాయకులు కెఎస్ రావు, కార్యదర్శి నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, జి.అప్పలరాజు, వినోద్, శ్రీనివాసరావు, జనసేన నాయకులు మీసాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకం కింద చెరువు గట్లు, రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో పలు రకాలకు చెందిన 3700 మొక్కలు నాటారు.

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో...

విశాఖపట్నం : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కుంచె పేర్కొన్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆనందపురం వద్ద జాతీయ రహదారి-16పై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ఎన్‌హెచ్ ఏఐ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు సురేశ్, ఇంజనీర్లు రిచర్డ్ ఫోర్డ్, తిరుపతిరావు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం ఇప్పించాం... ప్లాంటును నడిపించాల్సింది వారే

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలని చెబితే ఆ మాటలు...కొందరికి రుచించడం లేదు.

ప్ర: అధికారంలో ఉన్నది మీరే కాబట్టి ఘోస్ట్ కార్మికులు, యు-పాస్‌లపై చర్యలు తీసుకోవచ్చు కదా అంటున్నారు. అలా చేస్తారా?

జ:పని చేయకుండానే చాలామంది జీతాలు తీసుకున్నారు.మస్తర్ వేసి బయట తిరిగేవారు. కేంద్రం ఇన్‌చార్జిగా పంపిన సీఎండీ వాటన్నింటికీ అడ్డుకట్ట వేశారు. ఆ విషయాలనే నేను మాట్లాడాను. బ్లాస్ట్ ఫర్నేస్-3లో పని లేకపోయినా 700 మందిని కొనసాగిస్తున్నారు. పబ్లిక్ రంగ సంస్థలు నిబంధనల ప్రకారం పనిచేస్తాయి. వాటిలో రాజకీయ జోక్యం ఉండదు. పక్కనే హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, భెల్ వంటి సంస్థలు ఉన్నాయి. వాటిలో ఎక్కడా రాజకీయ జోక్యం లేదనే విషయం గుర్తించాలి. యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పని చేసుకోవాలి. మమ్మల్ని అందులోకి లాగకూడదు.

ప్ర: కేంద్రం ఇచ్చిన నిధుల నుంచి తమకు జీతాలు ఇవ్వలేదని, బ్యాంకుల అప్పులు తీర్చడానికి, పన్నులు కట్టడానికే వాడారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దానికి ఏమంటారు?

జ: ప్లాంటు నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు లేవని, అప్పు కూడా పుట్టడం లేదని, సాయం చేయాలని అడిగితే ఢిల్లీ పెద్దలను ఒప్పించి ఆ నిధులు ఇప్పించాము. వాటితో బ్యాంకుల అప్పులు తీర్చడం వల్ల వడ్డీ భారం తగ్గింది. మళ్లీ క్రెడిట్ నోట్లు జారీచేయడంతో ముడి పదార్థాలను తెచ్చుకోగలుగుతున్నారు. ఆ నిధులను జీతాలకు వాడేస్తే ప్లాంటు పరిస్థితి ఏమిటి? అందుకే అలా చేశారు.

ప్ర: కార్మికులను నిర్వాసితులు, కాంట్రాక్ట్ వర్కర్లు అని విడదీసి మాట్లాడుతున్నారని ఆరోపణలకు మీరు ఏమంటారు?

జ: ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ప్లాంటుకు ఏదైనా పని ఉన్నప్పుడు కాంట్రాక్ట్ వర్కర్లను పెట్టుకుంటారు. అవసరం లేనప్పుడు వారిని ఆపేస్తారు. ఇది అన్ని సంస్థల్లో ఉన్న విధానమే. ప్లాంటు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వారి సంఖ్య తగ్గించారు. దానికి వారు సమ్మె చేయడం, ఉద్యోగ, కార్మిక సంఘాలు మద్దతు పలకడం ఏ విధంగాను సమర్థనీయం కాదు. ఇక నిర్వాసితుల విషయానికి వస్తే...వారు ప్లాంటుకు భూములు ఇచ్చారు. ఉపాధి కల్పించాల్సిన బాధ్యత నాయకులుగా మాపై ఉంది. ఇంకో ఎనిమిది వేల మందికి ఉపాధి చూపించాల్సి ఉంది. అందుకే వారికి అండగా ఉంటామని చెప్పాను.

ప్ర: వంద శాతం ఉత్పత్తి సాధ్యమేనా?

జ: ఇప్పటివరకూ ఆ దిశగా యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు ప్రయత్నం చేయలేదు. ఎవరికి వారు విధులను పక్కనపెట్టి బయట పనులు చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నడిస్తేనే లాభాలు వస్తాయి. అప్పుడే నెలనెలా జీతాలు అందుతాయి. అవసరమైనవన్నీ సమకూర్చాము కాబట్టి కష్టపడి పనిచేసి పూర్తి ఉత్పత్తి తీయాల్సిందే. ఇది వ్యాపారం. పోటీగా పనిచేసినప్పుడే నిలబడతారు.

ప్ర: విశాఖ స్టీల్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపించవచ్చు కదా అంటున్నారు?

జ: గత సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాలు కలిసి విద్యుత్ బిల్లులు కట్టడానికి మూడు నెలల సమయం అడిగితే...మీరు కట్టకపోతే ఎవరు కడతారని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే ఏమీ అనలేదు. ఇప్పుడు మేము విద్యుత్ బిల్లులు, నీటి చార్జీలు, ఆస్తి పన్ను అన్నీ రెండేళ్ల వరకూ ఒత్తిడి లేకుండా చేశాము. దానిపై ఎవరూ మాట్లాడరు. వంద శాతం ఉత్పత్తి తీసి, మా దగ్గర స్టీల్ నిల్వలు ఉన్నాయని చెబితే తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపిస్తాం. అంతేకాకుండా రెండేళ్ల 100 శాతం ఉత్పత్తి చేసి, లాభాలు చూపిస్తే సెయిల్‌లో విలీనం చేయిస్తాము. అదే మా లక్ష్యం.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాపుజగ్గరాజుపేటల్లో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలు, శొంఠ్యాంలో ఎన్ఎస్ఆర్ఐటీ, నరవలోని విట్స్) కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష 1,940 మంది అభ్యర్థులు రాస్తారు. ప్రిన్సిపాల్, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు మూడు గంటలు, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2.30 గంటలు, ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్షకు 1.30 గంటల సమయం కేటాయించారు. దీంతో కొన్ని పరీక్షలు ఉదయం 9, మరికొన్ని 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం సెషన్‌లో 2 గంటలు, 2.30 గంటలకు మొదలవుతాయి. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష మాత్రం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారు. పరీక్షలు సజావుగా నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. డైట్ ప్రిన్సిపాల్ (ఫోన్ నంబరు 9949993730) ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. పరీక్షలను డీఈవో ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించనున్నారు. గురువారం డిపార్టుమెంటల్ అధికారులతో డీఈఓ సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఇతరత్రా సాయం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ (9849739920, 9177292969, 8328525861) ఏర్పాటు చేశారు.

పాఠశాలలకు విద్యార్థి కిట్లు

... 5వ పేజీ తరువాయి

8,618 మంది, విశాఖ అర్బన్‌లో 8,365 మంది, భీమునిపట్నంలో 8,014 మంది, సీతమ్మధారలో 7,512, పెందుర్తిలో 7,102, గాజువాకలో 6,224, ఆనందపురంలో 4,239, పెదగంట్యాడలో 3,664, పద్మనాభంలో 3257, ములగాడ మండలంలో 3,148 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతులను బట్టి మూడు సైజులలో కిట్లు సరఫరా చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ పిక్టోరియల్ డిక్షనరీ, ఆరో తరగతి నుంచి ఆక్స్‌ఫర్డు డిక్షనరీ అందజేస్తారు. యూనిఫారానికి సంబంధించి క్లాత్ ఇస్తారు. విద్యార్థులు కుట్టించుకోవాలి. టైలర్ మజూరీ ఖర్చు విద్యార్థి తల్లుల ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది. కాగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, సీఎంవో దేముడుబాబు జిల్లాలో స్టాకు పాయింట్ల వద్ద కిట్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం బ్యాగులు పంపిణీ చేయడంతో నెల, రెండు నెలల్లో జిప్‌లు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం, నాణ్యమైన బ్యాగుల సరఫరాపై దృష్టిసారించింది. ఈనెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజున తల్లిదండ్రుల కమిటీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఉన్నత పాఠశాలల్లో స్కూలు రెడీనెస్ కార్యక్రమం నిర్వహిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వచ్చే నెల 9, 10 తేదీల్లో సింహగిరి ప్రదక్షిణ

... 5వ పేజీ తరువాయి

నుంచి పదో తేదీ సాయంత్రం వరకూ దర్శనాలు ఉంటాయన్నారు. కొండ దిగువన తొలి పావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూ లైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. ఆలయ ఈవో సూచనల మేరకు అవసరమైన అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. స్టాళ్లు పెట్టుకునే వారికి ముందుగా అనుమతి ఇచ్చి సంబంధిత మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. భక్తులకు అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. కొండపై అగ్నిమాపక శకటం, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. తొమ్మిదో తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టడం ద్వారా గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు.పదో తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామి వారికి నాలుగో విడత చందన సమర్పణ జరుగుతుందని వివరించారు.

భక్తులకు వసతులు

ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగినట్టుగా కొబ్బరికాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కొండపైన 170, దిగువన 58 సీసీ కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటుచేస్తామన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్,వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎండ..వాన

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఒక్కసారిగా నగరం, పరిసరాల్లో మేఘాలు ఆవరించాయి.ఈదురుగాలులు వీచాయి. మధురవాడ, ఎండాడ, విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో సుమారు 45 నిమిషాలసేపు వర్షం కురిసింది. మధురవాడ జాతరలో 54.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే విచిత్రంగా సత్యం జంక్షన్ నుంచి...ఇటు ఎన్ఏడీ వైపు చినుకులేదు. అక్కయ్యపాలెం, కంచరపాలెం, మిగిలిన ప్రాంతాల్లో గాలులు తప్ప వర్షం పడలేదు.

విశాఖకు 'సత్వా'?

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో పాటు బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ నిర్మించిన యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం కూడా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం వస్తున్నారు. ప్రొటోకాల్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా హాజరవుతున్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, సంపెంగల మాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఎండల ధాటికి తగ్గిన భక్తుల తాకిడి


ప్రధాన రాజగోపురం వద్ద తక్కువ సంఖ్యలో ఉన్న భక్తులు

సింహాచలం,జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :కొద్ది రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో అప్పన్న ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి తగ్గింది. సాధారణంగా ప్రతి గురు, శనివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. కానీ వారం రోజులుగా ఎండలు అధికంగా ఉండడంతో (రోహిణి కార్తె ప్రభావం) భక్తులు చాలా తక్కువగా వస్తున్నారు. భక్తులతో నిత్యం సందడిగా ఉండే ప్రధాన రాజగోపురం పరిసర ప్రాంతాలు గురువారం ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నిర్మానుష్యంగా కనిపించాయి.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

కొమ్మాది, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డులోని నగరంపాలెం నుంచి శివశక్తి నగర్ రోడ్డును కలుపుతూ రూ. 43 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వార్డులో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, నాయకులు వాండ్రాసి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

సింహాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అడివివరం శాఖ గ్రంథాలయాధికారి ఎన్వీ నరసింహం సారథ్యంలో గత నెల 28న ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరం నిర్వహణకు సహకరించిని కార్మిక నేత సూర్యనారాయణరాజు, రిటైర్డ్ హెచ్ఎం మూర్తి, పాలెపు బంగారుచిట్టి, గ్రంథాలయ స్థల దాత సన్యాసయ్యశెట్టిని శాలువతో సత్కరించారు.

ఉల్టా...పల్టా

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడం వంటి అంశాలపై నిలదీయాలని మరికొందరు భావిస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపు పొందిన జీవీఎంసీకి ఐదు నెలలుగా కమిషనర్‌ను నియమించకపోవడాన్ని కూడా కౌన్సిల్‌లో ప్రస్తావించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆరి లోవ, మల్కాపురం ఫస్ట్ రిఫరల్‌యూనిట్ (జీవీఎంసీ ఆస్పత్రులు)ను బెహరా గ్రూపునకు అప్పగించడంలో లొసుగులపై కూడా కూటమి సభ్యులు చర్చకు లేవనెత్తే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో జీవీఎంసీ పరిధిలో జారీచేసిన టీడీఆర్‌లు, కూర్మన్నపాలెంలో ఎంవీవీ, ఎంకే అపార్టుమెంట్ నిర్మాణంలో అక్రమాలపై కూడా చర్చకు పట్టుబట్టాలని కూటమిలోని కార్పొరేటర్లు కొందరు భావిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లే కౌన్సిల్‌లో విపక్ష పాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తుండడంతో సమావేశం ఎలా జరుగుతుందన్న ఆసక్తి నెలకొంది.

రూ. 74 లక్షలతో కాలువల్లో పూడికతీత

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 5, 6, 7 వార్డుల పరిధిలోని కొమ్మాది నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీతకు గురువారం ఆయన మధురవాడలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో పూడికతీతకు రూ.74.5 లక్షల జీవీఎంసీ నిధులు కేటాయించినట్టు చెప్పారు. ఈ నిధులతో మూడు వార్డుల పరిధిలో ఉన్న కాలువల్లో పూడికలు తీయిస్తామన్నారు. వర్షం పడితే కాలువల్లోని పూడికలు రోడ్లపై ప్రవహించి ఇబ్బందులు కలుగుతున్నాయని, పూడికతీత పూర్తయితే ఆ సమస్య ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, కూటమి నాయకులు పిళ్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, అచ్చుతరావు, శివాజీ, మామిడి దుర్గారావు, సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు పూజలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో మరిడిమాంబ అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

రెండో వార్డు పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేర్ల అనసూయ కుటుంబానికి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, నాయకులు చోడిపల్లి సాయి జయ శంకర్, మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, ఊళ్ల నరసింగరావు, దుర్గారావు, జోగ సన్యాసిరావు, జి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లోనూ సంపద తయారీ కేంద్రాలు

భీమునిపట్నం (రూరల్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లోనూ సంపద తయారీ కేంద్రాలు


సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

ఏర్పాటు చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని రేఖవానిపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్వహణ బాగుందని, ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా ఉందన్నారు. ఈ కారణంగానే రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రంగా ఈ గ్రామాన్ని ఎంపిక చేశామని చెప్పారు. పంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు దాని ద్వారా ఎరువులు తయారు చేయడానికి సంపద తయారీ కేంద్రాలు ఉపకరిస్తాయని చెప్పారు. అనంతరం పంచాయతీ ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కాళ్ల రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి

భీమునిపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని నియోజకవర్గ సమన్వయకర్త సవరవిల్లి రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వినియోగదారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

భీమునిపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భీమిలిలో వినియోగదారుల సంక్షేమ సంఘం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. సన్యాసినాయుడు, గౌరవాధ్యక్షుడిగా భీమారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా పి. రాజేంద్రప్రసాద్ వర్మ,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సూర్య శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

మధురవాడలో కుండపోత



మధురవాడ/ కొమ్మాది/ విశాలాక్షినగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. 3 గంటలకు మొదలైన వర్షం గంటసేపు పడింది. కాలువలు పొంగి ప్రవహించడంతో రోడ్లు జలమయమయ్యాయి. రేవళ్ళపాలెం రోడ్డులో భారీగా నీరు ప్రవహించంతో కారు కాలువలోకి ఒరిగిపోయింది. కారులో ఉన్న వారు అప్రమత్తం కావడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మధురవాడ ఎత్తు వంతెన, స్వతంత్రనగర్ కాలనీ, డైలీ మార్కెట్, పీహెచ్‌సీ ప్రాంతాల్లో వర్షం నీరు నిలిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. విశాలాక్షినగర్‌లో ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు ఆధ్వర్యంలో సిబ్బంది కూలిన చెట్లను తొలగించారు.


విశాలాక్షినగర్‌లో నేలకొరిగిన చెట్లను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


రోడ్డుపై నీరు ప్రవహించడంతో కాలువలోకి ఒరిగిన కారు


మద్దిలపాలెం : ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఉదయ్ భాస్కరరెడ్డి


పెదవాల్తేర్ : బీజేపీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, పార్టీ నేతలు


వెంకోజీపాలెం : ఏయూలో మొక్కలను నాటిన ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

» ప్రజలకు పలువురు నిపుణుల పిలుపు » ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం » పలు చోట్ల మొక్కలు నాటిన ప్రముఖులు, విద్యార్థులు

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటడం, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా.. మనుగడకు సవాల్‌గా మారుతున్న ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మెలగాలని సూచించారు.

మద్దిలపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలకు మారాలని ఏయూ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో గురువారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని తెలిసినా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వారి నిర్లక్ష్యం వాతవరణంలో మార్పులకు దారి తీస్తుందని తెలుసుకోవాలని చెప్పారు. ప్లాస్టిక్ ప్రపంచాన్ని పీడిస్తున్న పెద్ద కాలుష్య భూతమన్నారు. పరిశ్రమ నిర్వహకులు, ప్రజలు బయోడిగ్రేడిబుల్ ప్లాస్టిక్, ఇతర రీసైక్లింగ్ పద్ధతులకు మారి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

ప్రొఫెసర్ ఉదయ్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు, ఎన్జీవోలు పాల్గొనడం పర్యావరణ స్థిరత్వం పట్ల పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు జ్ఞానాన్ని పంచుకోవడానికి, పెంచుకోవడానికి దోహదపడడమే కాకుండా పరిశుభ్రమైన, పచ్చదనం, ప్లాస్టిక్ రహిత భవిష్యత్‌కు నాంది వంటిందన్నారు. అనంతరం ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధులు మొక్కలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎస్ఈఈలు జి.నాగిరెడ్డి, రామారావు నాయుడు, ఈఈ పీవీ ముకుందరావు, పి.శ్రీనివాసరావు, ఐ.సూర్యకళ, రైటర్డ్ అధికారులు ఎన్వీ భాస్కరరావు, కె.శ్రీరామ్మూర్తి, ఎన్జీవో ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో 'ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటడం' నినాదంతో గురువారం నగర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ జిల్లా పదాధికారులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్‌బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, నేతలు సుహాసినీఆనంద్, బొండ నరేంద్రప్రకాశ్, జీసీ నాయుడు, జె.దామోదర్ యాదవ్, పాలిమేర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, జీవీఎంసీ, గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో చినవాల్తేరులోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ సునీల్ కుమార్ విచ్చేశారు. కార్యక్రమంలో రూపాకు రవికుమార్, జీవీఎంసీ యునిసెఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నీలి శ్రీనివాస్ రాజమణి, ప్రొఫెసర్ నాగభూషణరావు, ఆర్ఎంవో డాక్టర్ కేవీఎల్ శాస్త్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ మరియమ్మ, మరగడ గైరీ రెడ్డి, గేదేల శ్రీహరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 17వ వార్డు శానిటరీ సిబ్బంది వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడి సెక్టర్-1లోని కొత్త వెంకోజీపాలెం ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలో పేరుకుపోయ ఉన్న చెత్తను తొలగించి ఆ స్థానంలో మొక్కలను నాటారు. వ్యర్థాలు, చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇకపై మొక్కలకు నీరు పోయాలి తప్ప చెత్తను పడవేయకూడదని పారిశుధ్య స్బిబంది తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయకూడదని, చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సచివాలయం శానిటరీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో..

వెంకోజీపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సుమారు ఐదు సంవత్సరాల వయసు కలిగిన రావి, వేప మొక్కలను నాటారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ తిరుపతిరావు, వీరాస్వామి, ప్రభాకర్, రాజశేఖర్ రాజు, బి.వి.రమణ పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో నెహ్రూనగర్ నుంచి పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం మాట్లాడుతూ.. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌కు అందరూ స్వస్తిచెప్పి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సిరిపురంలో..

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భూమి పొరలను నాశనం చేస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు సూచించారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్, గ్లోబల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా క్లబ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇస్కఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జె.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి విఘాతం కలిగించే రీతిలో అణుబాంబులు సహా అనేక వినాశకర వస్తువులను యుద్ధాల పేరుతో ఆయా ప్రాంతాలలో వినియోగించడం ద్వారా మానవాళికి సంవత్సరాల తరబడి వైకల్యం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు, సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, జోషి, రాంప్రభు, పోతన, సత్యవతి, వెంకటరమణ, పరమేశ్వరరావు, రాధారాణి, విజయలక్ష్మి, మధుబాబు పాల్గొన్నారు.


మొక్కలు నాటిన స్థలంలో చెత్త వేస్తే జరిమానా వేస్తాం అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన శానిటరీ సిబ్బంది

నాణ్యత వల్లే సముద్ర ఉత్పత్తులకు విలువ పెరుగుతుంది

» ఎస్ఎస్ఎఫ్ ఎం.డీ. పద్మనాభం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మనాభం

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యత పెంచడం వల్లే దాని విలువ పెరుగుతుందని ఎస్ఎస్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పద్మనాభం అన్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ గురువారం విశాఖలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిష్ హార్వెస్టింగ్ ట్రైనింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన సముద్ర ఆహార విలువ జోడింపు అంతర్రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యతపై ఉత్పత్తిదారులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్య పరిశ్రమ ఆక్వా సాగులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అలాగే అవకాశాలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి పి.అనిల్ కుమార్, మాట్లాడుతూ సముద్ర ఆహార ప్రాసెసింగ్‌లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు.కార్యక్రమంలో మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ యారగల్, వైజాగ్ ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.లక్ష్మణరావు, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశాఖ రీజనల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.కుజకుడాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ

» ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వాహన కాలుష్యన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన విశాఖపట్నం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక నగరంగా ఉన్న విశాఖలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు తమకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. వాహన కాలుష్యాన్ని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె రాజశేఖర్, విశాఖపట్నం డిపో మేనేజర్ కె గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం


కైలాసగిరిపై చెత్తను ఏరివేస్తున్న కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కైలాసగిరిపై ప్లాస్టిక్ రహిత కైలాసగిరి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ మానవ జీవన విధానం పర్యావరణ హితంగా ఉండాలని, విరివిగా ప్లాస్టిక్ వాడకం వల్ల భావితరాల మనుగడకు పెనుముప్పని, ప్లాస్టిక్ వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీర్ భవానీశంకర్, రామరాజు, దుర్గాప్రసాద్, రాంబాబు, సుజాతా శివానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిని పరిరక్షించడమే నా లక్ష్యం

» సివిల్ ఇంజనీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ
» అవగాహన కల్పిస్తూ ఆర్కే బీచ్ రోడ్డు నుంచి భీమిలి బీచ్ వరకూ 30 కిలోమీటర్ల రన్



మట్టి పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న చల్లా సుబ్రహ్మణ్య శర్మ

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మట్టిని పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో భావి తరాలకు తినడానికి సరైన తిండి కూడా దొరికే పరిస్థితులు ఉండవంటూ.. పర్యావరణం పరిరక్షణ మనందరికి ముఖ్య బాధ్యతగా తీసుకోవాలని సివిల్ ఇంజనీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన ఆయన వైజాగ్ నోవాటెల్ నుంచి భీమిలి బీచ్‌లోని నోవాటెల్ వరకు 30 కిలోమీటర్లు రన్ చేస్తూ పర్యావరణం, మట్టి పరిరక్షణపై జెండా పట్టుకొని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖకు చెందిన తనకు ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లోని చేపట్టిన మారథన్‌లోని పాల్గొనడం జరిగిందని, ఇప్పటి వరకూ 6140 కిలోమీటర్లు పరుగెత్తానని తెలిపారు. తనకు 56 ఏళ్లని, పర్యావరణంపై అవగాహన కలిగించాలన్నదే నా లక్ష్యమన్నారు. మట్టిని పరిరక్షించుకోకుంటే భవిష్యత్తులో సేంద్రీయ పంటలు పండే అవకాశమే లేదన్నారు. సేంద్రీయ పంటలు పడాలంటే కనీసం 12 శాతం మట్టి ఉండాలని అయితే ప్రస్తుతం 0.5 శాతం కూడా లేని దుస్థితి వచ్చిందన్నారు. దీన్ని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన


గోవర్ధన్‌ను సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, జూన్ 5 : (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్వర్యంలో ఇటీవల గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలో పెదవాల్తేర్‌కు చెందిన ఎల్.గోవర్ధన్ కాంస్య పతకం సాధించాడు. తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు తన కార్యాలయంలో గోవర్ధన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయుకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, గెదేల నాగరాజు, కంబావు శివారెడ్డి, కోచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 34, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 17, క్యారెట్ 36 దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 140, కీరదోస 34, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

గంటాను కలిసిన డిప్యూటీ మేయర్


గంటాను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ గోవిందరాజు, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీని అభివృద్ధి బాట పట్టించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిప్యూటీ మేయర్‌ను గంటా సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకుని ప్రజల మన్ననలు పొందాలన్నారు. డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ చైర్మన్‌తో భేటీ..

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరి మధ్య నగరాభివృద్ధిపై చర్చ జరిగింది. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధురాలిని రక్షించిన పోలీసులు

పెందుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ స్థితిలో వున్న వృద్ధురాలిని పోలీసులు రక్షించారు. గురువారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట ముత్యమాంబ కాలనీలో ఒక వృద్ధురాలి తన కూతురు, మనవడితో కలిసి నివసిస్తున్నది. ఈ క్రమంలో వృద్ధురాలి నగలను ఆమె మనవడు కుదవ పెట్టాడు. ఆ నగలు తెచ్చి ఇవ్వాల్సిందిగా పలుమార్లు వృద్ధురాలు తన మనవడికి చెప్పినా పెడచెవిన పెట్టాడు. దీంతో మనవడి ప్రవర్తనతో విసుగు చెందిన వృద్ధురాలు ఇంటిలో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్ లీకు చేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వృద్ధురాలి ఇంటి నుంచి గ్యాస్ వాసన రావటంతో ఇరుగు,పొరుగు వారు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో సీఐ సతీశ్‌కుమార్ తక్షణం స్పందించి పోలీసుల సహాయంతో ఇంటి తలుపులు పగలుకొట్టి గ్యాస్ లీకేజీని నియంత్రించారు. వృద్ధురాలికి సపర్యలు చేపి ఆమెను కోలుకునేలా చేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు.

10న కనకదుర్గమాంబ అనుపు మహోత్సవం


అమ్మవారి విగ్రహం


ఉత్సవాలకు సిద్ధం అవుతున్న కనకదుర్గమాంబ ఆలయం

వెంకోజీపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వవార్డు పరిధి ఇసుకతోట గ్రామ ఇలవేల్పు కనకదుర్గమాంబ వార్షిక పండుగ మహోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామమంతా మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ నెల 8న చాటింపు, 9న తొల్లేళ్లు, 10న అనుపు మహోత్సవం నిర్వహించనున్నట్టు శ్రీకృష్ణ యాదవ సేవా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, ప్రతినిధులు బొట్ట శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. ఈ నెల 8న చాటింపు, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 9న తొల్లేళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 10న అనుపు మహోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన జరుపునున్నారు. తెల్లవారు జాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించేందుకు వీలుగా ఏర్పాట్లను చేస్తున్నారు. సాయంత్రం పరస సంబరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు.

ఈ ఏడాది ప్రత్యేకంగా చాటింపు, తొల్లేళ్ల రోజున ప్రత్యేకంగా సంగీత విభావరిలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు.

ప్లాస్టిక్ నిరోధంతో పర్యావరణ పరిరక్షణ

» ఆర్ఎంపీ జోనల్ అధ్యక్షుడు జోషి


ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిరోధంతోనే పర్యావరణాన్ని కాపాడవచ్చని, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి అనుసరించాల్సిన ఉత్తమ విధానం ఇదేననిఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిరోధించాలని, మొక్కలు నాటాలనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభ కాలేజ్ అధినేత ఓం దీపక్ మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించకుంటే భావి తరాలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామన్నారు. మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ నిరోధంతో పాటు మొక్కలు నాటి నశించిపోయి ఓజోన్ పొరను పునరుద్ధరించడానికి సామాజిక బాధ్యతగా అందరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, గౌరవ సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, విశాఖ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి లోకేష్, గణేష్, నాయక్, కౌసల్యభవానీ, వెంకట్రావు, నరేంద్ర, జయరావు, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్-22810 విశాఖ-పారాదీప్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8, 15 తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

రైలు నంబర్-22809 పారాదీప్-విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 9, 16 తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అలాగే రైలు నంబర్-20807 విశాఖ-అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 10న ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను, రైలు నంబర్-20808 అమృతసర్ హిరాకుడ్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 14న ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

బహిరంగ మార్కెట్‌కు రైతుబజార్ కూరగాయలు

» నరసింహనగర్ బజార్‌లో దందా
» పట్టించుకోని అధికారులు

అక్కయ్యపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లో కూరగాయలకు కాళ్లొచ్చి బయటకు తరలిపోతున్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల సమయంలో రైతులు, డ్వాక్రా గ్రూపుల వారు తాజా కూరగాయలు, ఉల్లిపాయలు, టమాటాను బస్తాలతో బయట వ్యాపారులకు రైతుబజార్ నుంచి తరలిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బహిరంగ మార్కెట్లకు ఇలా తాజా కూరగాయలు తరలిస్తే తాము ఏం కొనుగోలు చేయాలని ప్రశ్నిస్తున్నారు.తాజా సరకులను బయటకు తరలించడం వల్ల మిగిలినవి కొనుగోలు చేస్తున్నామని, కొన్ని సమయాల్లో అయితే కూరగాయలు తమకు లభించడం లేదంటున్నారు. ఉదయం కార్యాలయాలకు వెళ్లాల్సిన వారు, వివిధ రకాల పనులు చేసుకుంటున్న తాము రైతుబజార్‌కు ఉదయాన్నే వచ్చి కూరగాయలు కొనుగోలు చేద్దామంటే ఇక్కడ విక్రయించడం లేదని ఆరోపిస్తున్నారు. ముందు బహిరంగ దుకాణాల వ్యాపారులకు బస్తాలతో తరలించిన తర్వాతే తమకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజలు తాజా కూరగాయలు కొనుగోలు చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్ ఏర్పాటు చేసిందని, అయినా బయట వ్యాపారుల హవానే ఇక్కడా సాగుతోందని అంటున్నారు. ఉదయం 10 గంటల తర్వాతే బహిరంగ దుకాణాలకు కూరగాయలు విక్రయించాలని, కానీ వారు ఈ సూచన పట్టించుకోకుండా ఉదయాన్నే రైతుబజార్‌కు వచ్చిన వెంటనే తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుబజార్ నుంచి కరివేపాకు, కూరగాయల మూటలను ఆటోల్లో తరలిస్తున్నారని చెబుతున్నారు. ఈ పోకడలను అధికారులు కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎస్టేట్ అధికారి కొండబాబును అడగ్గా.. ఈ విషయమై తమ వద్దకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయినప్పటికీ ప్రత్యేకంగా దృష్టి సారించి రైతుబజార్ నుంచి బహిరంగ మార్కెట్లకు కూరగాయలు తరలిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


బహిరంగ మార్కెట్‌కు తరలించడానికి ఆటోలో లోడ్ చేసిన కూరగాయలు


ఆటోలో తరలిస్తున్న కరివేపాకు


ఉల్లిపాయల బస్తా తీసుకెళ్తున్న వ్యాపారి

అంతర్జాతీయ విలువిద్య పోటీలకు గణేష్ మణిరత్నం

» రూ.50 వేలు ఆర్థిక సాయం అందించిన సూర్యనారాయణరెడ్డి



విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 5 : అంతర్జాతీయ అర్చరీ చాంపియన్‌షిప్‌టోర్నీకి నగరానికి చెందిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి గణేష్ మణిరత్నం ఎంపికయ్యాడు.పుణెలో జరిగిన భారత జట్టు ఎంపిక పోటీల్లో గణేష్ మణిరత్నం అద్భుతంగా రాణించి తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. దీంతో త్వరలో కెనడాలో జరగనున్న వరల్డ్ యూత్ అర్చరీ చాంపియన్‌షిప్, సింగపూర్‌లో జరగనున్న ఏషియన్ కప్ స్టేజ్-2 అర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నాడు.

గత ఏడాది ఐర్లాండ్‌లో జరిగిన వరల్డ్ యూత్ అర్చరీ చాంపియన్‌షిప్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం, కొరియాలో జరిగిన ఆసియా కప్ అర్చరీ టోర్నీలో కాంస్య పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన ఈవెంట్‌లో గణేష్‌మణిరత్నం మరోసారి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ టోర్నీకి అర్హత సాధించడంపై ఉమ్మడి విశాఖ అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఛైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం తరఫున మణిరత్నం క్రీడా అవసరాల నిమిత్తం రూ.50 వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా అర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు తీసుకొచ్చిన క్రీడా విధానాల్లో భాగంగా ప్రభుత్వ- ప్రైవేటుభాగస్వామ్యంతో సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన గణేష్‌మణిరత్నం అంతర్జాతీయ స్థాయికి చేరడం విశేషమన్నారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని అంతర్జాతీయ పతకాలు అందించి రాష్ట్ర, జిల్లా క్రీడారంగాలకు గర్వంగా నిలవాలని ఆకాంక్షించారు.

మొక్కలనునాటి ప్రత్యేక శ్రద్ధతో పరిరక్షించాలి

» ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, జూన్ 5, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, జీవీఎంసీ, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలను కనుపాపల వలే సాకాలన్నారు. విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాడానికి యువత నడుము బిగించి గడగడపకు అమ్మపేరుతో ఒక మొక్క నాటాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశయాన్ని నేరవేర్చాలని పిలుపునిచ్చారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రజలందరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యశాల ప్రధాన సంచాలకులు డాక్టర్ వేప మీనాక్షి, బీజేపీ వైద్య విభాగ కన్వీనర్ రవికుమార్, జీవీఎంసీ యునిసెఫ్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస రాజమణి, నేత్ర వైద్యశాల వైద్యులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ నవీన్ కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పాల్గొన్న నేత్ర వైద్యశాల వైద్యులు

ఎండ..వాన

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఒక్కసారిగా నగరం, పరిసరాల్లో మేఘాలు ఆవరించాయి. ఈదురుగాలులు వీచాయి. మధురవాడ, ఎండాడ, విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీ,మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో సుమారు 45 నిమిషాలసేపు వర్షం కురిసింది. మధురవాడ జాతరలో 54.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే విచిత్రంగా సత్యం జంక్షన్ నుంచి...ఇటు ఎన్‌ఏడీ వైపు చినుకులేదు. అక్కయ్యపాలెం, కంచరపాలెం, మిగిలిన ప్రాంతాల్లో గాలులు తప్ప వర్షం పడలేదు.

విశాఖకు 'సత్వా'?

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో పాటు బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ నిర్మించిన యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం కూడా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం వస్తున్నారు. ప్రొటోకాల్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా హాజరవుతున్నారు.

గెడ్డ ఆధునికీకరణకు శంకుస్థాపన

దొండపర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 27వ వార్డు దొండపర్తి సాయిబాబా ఆలయం దగ్గర రూ.41 లక్షలతో గెడ్డ అడుగు భాగంలో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ సభ్యుడు గొలగాని వీరారావు బుజ్జి గురువారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. మండావారి వీధిలో సీబీఎం ప్రాథమిక పాఠశాల పనులు, దొండపర్తి రజక వీధిలో దోబీఘాట్, సామాజిక భవన నిర్మాణ పనులు చేపట్టామన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న జీవీఎంసీ, సచివాలయ ఉద్యోగులు


వాకర్స్ పార్కులో జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న జడ్పీ బి. రాము


మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సమష్టి కృషితోనే పర్యావరణానికి రక్షణ

మాధవధార, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరంలోని మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జోన్-5 జడ్పీ బి. రాము మాట్లాడుతూ అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలిపారు. అనంతరం వాకర్స్ క్లబ్ పార్కులో మొక్కలు నాటారు. పార్కు కళా వేదిక వద్ద దాతలు సమకూర్చిన జ్యూట్ బ్యాగులను స్థానికులకు అందజేశారు. వాకర్స్ పార్క్ అధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ కార్యదర్శి సెల్వరాజు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి, బీజేపీ 50వ వార్డు అధ్యక్షుడు కూన వెంకటరావు, టీడీపీ అధ్యక్షుడు ఎస్. వరప్రసాద్ పాల్గొన్నారు.

53వ వార్డులో...

మర్రిపాలెం :గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెంలో సచివాలయం, జీవీఎంసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

విశాఖపట్నం : ప్రభుత్వ మహిళా కళాశాలలోవైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నివేదిత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య, విద్యార్థినులు పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం 'ప్లాస్టిక్ పొల్యూషన్ నిషేధం'అన్న అంశంపై వృక్ష శాస్త్ర విభాగాధిపతి నివేదిత మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అంగన్వాడీ కేంద్రంలో..

మురళీనగర్ : గ్రేటర్ 51వ వార్డులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలబాలికలు, స్థానిక మహిళలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని చేసే వస్తువులు వాడకూడదని ప్లకార్డులు పట్టి అంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వరలక్ష్మి, గాంధీనగర్ నివాసితులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డైమాండ్ పార్కులో...

దొండపర్తి :గ్రేటర్ 27వ వార్డులోని డైమాండ్ పార్కులో వార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధురి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి హాజయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లూరి సత్యనారయణరెడ్డి, శివప్రసాద్,వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో...

సీతమ్మధార : సీతమ్మధారలో ఉన్న ఈపీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో సంస్థ డైరెక్టర్లు చంద్రం, టీవీ సూర్యప్రకాష్, సీజీఎం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు సుమన్ కల్యాణి, వి. విజయలలిత, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణ పేర్కొన్నారు. కళాశాల్లో పర్యావరణం పరిరక్షణ, ప్లాస్టిక్ భూతం తీవ్రత తగ్గించడం అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగం అధికమైందన్నారు. వినియోగించిన ప్లాస్టిక్‌ను తిరిగి వివిధ రూపాల్లో రీసైకింగ్ చేయడం ద్వారా పెనుముప్పును తగ్గించవచ్చునన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గల త్రిస్టార్ వాకర్స్ క్లబ్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

వాల్తేరు రైల్వేలో...

విశాఖపట్నం : వాల్తేరు రైల్వేలో ప్రపంచ పర్యావరణ దినోత్సం ఘనంగా నిర్వహించారు.. ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొని డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో మొక్కలు నాటి, బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఉపాధ్యక్షులు మధుమిత సాహు, కార్యదర్శి అంకిత శర్మ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి కృషి చేయాలని 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.అప్పారావు ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. 44వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్ పార్కులో పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాకర్లకు అబిద్‌నగర్ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వెంకటపతి రాజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం బజార్‌లోనూ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సెక్రటరీలు అలిమ, ఫాతిమా, నానాజీ, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాత నగరంలో..

మహారాణిపేట : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ సీనియర్ నాయకుడు గోడి నరసింహాచారి అన్నారు. వన్ టౌన్‌లో టౌన్ హాల్ ప్రాంతంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జి. విజయలక్ష్మి, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా కళాశాలలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మజ, రత్నశేఖర్, శ్రావణ్‌రాజు, వెంకట్, దిలీప్ పాల్గొన్నారు. 31వ వార్డు పరిధిలోని సెంట్రల్ పార్కులోనూ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం. కామేశ్వరరావు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీ సూపర్‌వైజర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో...

విశాఖపట్నం : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కుంచె పేర్కొన్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆనందపురం వద్ద జాతీయ రహదారి-16పై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ఎన్‌హెచ్ ఏఐ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు.


మొక్కలు నాటిన వాల్తేరు రైల్వే ఏడీఆర్‌ఎంలు, ఇతర అధికారులు


మొక్కలు నాటుతున్న అధికారులు

ఆర్థిక సాయం ఇప్పించాం... ప్లాంటును నడిపించాల్సింది వారే

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలని చెబితే ఆ మాటలు...కొందరికి రుచించడం లేదు.

ప్ర : అధికారంలో ఉన్నది మీరే కాబట్టి ఫోస్ట్ కార్మికులు, యు-పాస్‌లపై చర్యలు తీసుకోవచ్చు కదా అంటున్నారు. అలా చేస్తారా?

జ: పని చేయకుండానే చాలామంది జీతాలు తీసుకున్నారు. మస్టర్ వేసి బయట తిరిగే వారు. కేంద్రం ఇన్‌చార్జిగా పంపిన సీఎండీ వాటన్నింటకీ అడ్డుకట్ట వేశారు. ఆ విషయాలనే నేను మాట్లాడాను. బ్లాస్ట్ ఫర్నేస్-3లో పని లేకపోయినా 700 మందిని కొనసాగిస్తున్నారు. పబ్లిక్ రంగ సంస్థలు నిబంధనల ప్రకారం పని చేస్తాయి. వాటిలో రాజకీయ జోక్యం ఉండదు. పక్కనే హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, భెల్ వంటి సంస్థలు ఉన్నాయి. వాటిలో ఎక్కడా రాజకీయ జోక్యం లేదనే విషయం గుర్తించాలి. యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పని చేసుకోవాలి. మమ్మల్ని అందులోకి లాగకూడదు.

ప్ర: కేంద్రం ఇచ్చిన నిధుల నుంచి తమకు జీతాలు ఇవ్వలేదని, బ్యాంకుల అప్పులు తీర్చడానికి, పన్నులు కట్టడానికే వాడారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దానికి ఏమంటారు?

జ: ప్లాంటు నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు లేవని, అప్పు కూడా పుట్టడం లేదని, సాయం చేయాలని అడిగితే ఢిల్లీ పెద్దలను ఒప్పించి ఆ నిధులు ఇప్పించాము. వాటితో బ్యాంకుల అప్పులు తీర్చడం వల్ల వడ్డీ భారం తగ్గింది. మళ్లీ క్రెడిట్ నోట్లు జారీచేయడంతో ముడి పదార్థాలను తెచ్చుకోగలుగుతున్నారు. ఆ నిధులను జీతాలకు వాడేస్తే ప్లాంటు పరిస్థితి ఏమిటి? అందుకే అలా చేశారు.

ప్ర: కార్మికులను నిర్వాసితులు, కాంట్రాక్ట్ వర్కర్లు అని విడదీసి మాట్లాడుతున్నారని ఆరోపణలకు మీరు ఏమంటారు?

జ: ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ప్లాంటుకు ఏదైనా పని ఉన్నప్పుడు కాంట్రాక్ట్ వర్కర్లను పెట్టుకుంటారు. అవసరం లేనప్పుడు వారిని ఆపేస్తారు. ఇది అన్ని సంస్థల్లో ఉన్న విధానమే. ప్లాంటు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వారి సంఖ్య తగ్గించారు. దానికి వారు సమ్మె చేయడం, ఉద్యోగ, కార్మిక సంఘాలు మద్దతు పలకడం ఏ విధంగాను సమర్థనీయం కాదు. ఇక నిర్వాసితుల విషయానికి వస్తే...వారు ప్లాంటుకు భూములు ఇచ్చారు. ఉపాధి కల్పించాల్సిన బాధ్యత నాయకులుగా మాపై ఉంది. ఇంకో ఎనిమిది వేల మందికి ఉపాధి చూపించాల్సి ఉంది. అందుకే వారికి అండగా ఉంటామని చెప్పాను.

ప్ర: వంద శాతం ఉత్పత్తి సాధ్యమేనా?

జ: ఇప్పటివరకూ ఆ దిశగా యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు ప్రయత్నం చేయలేదు. ఎవరికి వారు విధులను పక్కనపెట్టి బయట పనులు చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నడిస్తేనే లాభాలు వస్తాయి. అప్పుడే నెలనెలా జీతాలు అందుతాయి. అవసరమైనవన్నీ సమకూర్చాము కాబట్టి కష్టపడి పనిచేసి పూర్తి ఉత్పత్తి తీయాల్సిందే. ఇది వ్యాపారం. పోటీగా పనిచేసినప్పుడే నిలబడతారు.

ప్ర: విశాఖ స్టీల్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపించవచ్చు కదా అంటున్నారు?

జ: గత సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాలు కలిసి విద్యుత్ బిల్లులు కట్టడానికి మూడు నెలల సమయం అడిగితే...మీరు కట్టకపోతే ఎవరు కడతారని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే ఏమీ అనలేదు. ఇప్పుడు మేము విద్యుత్ బిల్లులు, నీటి చార్జీలు, ఆస్తి పన్ను అన్నీ రెండేళ్ల వరకూ ఒత్తిడి లేకుండా చేశాము. దానిపై ఎవరూ మాట్లాడరు. వంద శాతం ఉత్పత్తి తీసి, మా దగ్గర స్టీల్ నిల్వలు ఉన్నాయని చెబితే తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపిస్తాం. అంతేకాకుండా రెండేళ్లు 100 శాతం ఉత్పత్తి చేసి, లాభాలు చూపిస్తే సెయిల్‌లో విలీనం చేయిస్తాము. అదే మా లక్ష్యం.

ఉల్టా...పల్టా

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడం వంటి అంశాలపై నిలదీయాలని మరికొందరు భావిస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపు పొందిన జీవీఎంసీకి ఐదు నెలలుగా కమిషనర్‌ను నియమించకపోవడాన్ని కూడా కౌన్సిల్‌లో ప్రస్తావించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆరిలోవ, మల్కాపురం ఫస్ట్ రిఫరల్‌యూనిట్ (జీవీఎంసీ ఆస్పత్రులు)ను బెహరా గ్రూపునకు అప్పగించడంలో లొసుగులపై కూడా కూటమి సభ్యులుచర్చకు లేవనెత్తే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో జీవీఎంసీ పరిధిలో జారీచేసిన టీడీఆర్‌లు,కూర్మన్నపాలెంలో ఎంవీవీ, ఎంకే అపార్టుమెంట్ నిర్మాణంలో అక్రమాలపై కూడా చర్చకు పట్టుబట్టాలని కూటమిలోని కార్పొరేటర్లు కొందరు భావిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లే కౌన్సిల్‌లో విపక్షపాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తుండడంతో సమావేశం ఎలా జరుగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాపుజగ్గరాజుపేటల్లో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలు, శొంఠ్యాంలో ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ, నరవలోని విట్స్) కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష 1,940 మంది అభ్యర్థులు రాస్తారు.

ప్రిన్సిపాల్, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు మూడు గంటలు, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2.30 గంటలు, ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్షకు 1.30 గంటల సమయం కేటాయించారు. దీంతో కొన్ని పరీక్షలు ఉదయం 9 గంటలు, మరికొన్ని 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం సెషన్‌లో 2 గంటలు, 2.30 గంటలకు మొదలవుతాయి. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష మాత్రం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారు.

పరీక్షలు సజావుగా నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. డైట్ ప్రిన్సిపాల్ (ఫోన్ నంబరు 9949993730) ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేశారు. పరీక్షల నిర్వహణను విశాఖ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించనున్నారు. గురువారం డిపార్టుమెంటల్ అధికారులతో డీఈఓ సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఇతరత్రా సాయం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ (9849739920, 9177292969, 8328525861) ఏర్పాటుచేసినట్టు డీఈవో తెలిపారు. అభ్యర్థులు ముందుగా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

పాఠశాలలకు విద్యార్థి కిట్లు

... 5వ పేజీ తరువాయి

8,618 మంది, విశాఖ అర్బన్‌లో 8,365 మంది, భీమునిపట్నంలో 8,014 మంది, సీతమ్మధారలో 7,512, పెందుర్తిలో 7,102, గాజువాకలో 6,224, ఆనందపురంలో 4,239, పెదగంట్యాడలో 3,664, పద్మనాభంలో 3257, ములగాడ మండలంలో 3,148 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతులను బట్టి మూడు సైజులలో కిట్లు సరఫరా చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ పిక్టోరియల్ డిక్షనరీ, ఆరో తరగతి నుంచి ఆక్స్‌ఫర్డు డిక్షనరీ అందజేస్తారు. యూనిఫారానికి సంబంధించి క్లాత్ ఇస్తారు. విద్యార్థులు కుట్టించుకోవాలి. టైలర్ మజూరీ ఖర్చు విద్యార్థి తల్లుల ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది. కాగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, సీఎంవో దేముడుబాబు జిల్లాలో స్టాకు పాయింట్ల వద్ద కిట్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం బ్యాగులు పంపిణీ చేయడంతో నెల, రెండు నెలల్లో జిప్‌లు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం, నాణ్యమైన బ్యాగుల సరఫరాపై దృష్టిసారించింది. ఈనెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజున తల్లిదండ్రుల కమిటీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఉన్నత పాఠశాలల్లో స్కూలు రెడీనెస్ కార్యక్రమం నిర్వహిస్తామని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు.

వచ్చే నెల 9, 10 తేదీల్లో సింహగిరి ప్రదక్షిణ

... 5వ పేజీ తరువాయి

నుంచి పదో తేదీ సాయంత్రం వరకూ దర్శనాలు ఉంటాయన్నారు. కొండ దిగువన తొలి పావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని సూచించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈవో సూచనల మేరకు అవసరమైన అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. స్టాళ్లు పెట్టుకునే వారికి ముందుగా అనుమతి ఇచ్చి సంబంధిత మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. భక్తులకు అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. కొండపై అగ్నిమాపక శకటం, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. తొమ్మిదో తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టడం ద్వారా గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. పదో తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామి వారికి నాలుగో విడత చందన సమర్పణ జరుగుతుందని వివరించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు

ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగినట్టుగా కొబ్బరికాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కొండపైన 170, దిగువన 58 సీసీ కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటుచేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మద్దిలపాలెం : ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ఉదయ్ భాస్కరరెడ్డి



పెదవాల్తేర్ : బీజేపీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, పార్టీ నేతలు



వెంకోజీపాలెం : ఏయూలో మొక్కలను నాటిన ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- ప్రజలకు పలువురు నిపుణుల పిలుపు
- ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం
- పలు చోట్ల మొక్కలు నాటిన ప్రముఖులు, విద్యార్థులు

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటడం, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా.. మనుగడకు సవాల్‌గా మారుతున్న ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మెలగాలని సూచించారు.

మద్దిలపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలకు మారాలని ఏయూ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో గురువారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణాన్ని దెబ్బతీస్తుందని తెలిసినా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వారి నిర్లక్ష్యం వాతవరణంలో మార్పులకు దారి తీస్తుందని తెలుసుకోవాలని చెప్పారు. ప్లాస్టిక్ ప్రపంచాన్ని పీడిస్తున్న పెద్ద కాలుష్య భూతమన్నారు. పరిశ్రమ నిర్వహకులు, ప్రజలు బయోడిగ్రేడిబుల్ ప్లాస్టిక్, ఇతర రీసైక్లింగ్ పద్ధతులకు మారి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

ప్రొఫెసర్ ఉదయ్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు, ఎన్జీవోలు పాల్గొనడం పర్యావరణ స్థిరత్వం పట్ల పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు జ్ఞానాన్ని పంచుకోవడానికి, పెంచుకోవడానికి దోహదపడడమే కాకుండా పరిశుభ్రమైన, పచ్చదనం, ప్లాస్టిక్ రహిత భవిష్యత్‌కు నాంది వంటిందన్నారు. అనంతరం ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధులు మొక్కలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎస్ఈఈలు జి.నాగిరెడ్డి, రామారావు నాయుడు, ఈఈ పీవీ ముకుందరావు, పి.శ్రీనివాసరావు, ఐ.సూర్యకళ, రైటర్డ్ అధికారులు ఎస్వీ భాస్కరరావు, కె.శ్రీరామ్మూర్తి, ఎన్జీవో ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో 'ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటడం' నినాదంతో గురువారం నగర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ జిల్లా పదాధికారులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్‌బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ద లక్ష్మీనారాయణ, నేతలు సుహాసినీఆనంద్, బొండ నరేంద్రప్రకాశ్, జీసీ నాయుడు, జె.దామోదర్ యాదవ్, పాలిమేర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, జీవీఎంసీ, గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త అధ్వర్యంలో చినవాల్తేరులోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి అవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ సునీల్ కుమార్ విచ్చేశారు. కార్యక్రమంలో రూపాకు రవికుమార్, జీవీఎంసీ యునిసెఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నీలి శ్రీనివాస్ రాజమణి, ప్రొఫెసర్ నాగభూషణరావు, ఆర్ఎంవో డాక్టర్ కేఎల్జీ శాస్త్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ మరియమ్మ, మరగడ గైరీ రెడ్డి, గేదేల శ్రీహరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 17వ వార్డు శానిటరీ సిబ్బంది వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడి సెక్టర్-1లోని కొత్త వెంకోజీపాలెం ఎన్ఆర్ఐ కళాశాల సమీపంలో పేరుకుపోయ ఉన్న చెత్తను తొలగించి ఆ స్థానంలో మొక్కలను నాటారు. వ్యర్థాలు, చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇకపై మొక్కలకు నీరు పోయాలి తప్ప చెత్తను పడవేయకూడదని పారిశుధ్య స్బిబంది తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయకూడదని, చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సచివాలయం శానిటరీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో..

వెంకోజీపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సుమారు ఐదు సంవత్సరాల వయసు కలిగిన రావి, వేప మొక్కలను నాటారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ తిరుపతిరావు, వీరాస్వామి, ప్రభాకర్, రాజశేఖర్ రాజు, బి.వి.రమణ పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో నెహ్రూనగర్ నుంచి పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అందరూ స్వస్తిచెప్పి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. మొక్క లు నాటాలన్నారు. పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సిరిపురంలో..

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భూమి పొరలను నాశనం చేస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు సూచించారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్, గ్లోబల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా క్లబ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇస్కఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జె.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి విఘాతం కలిగించే రీతిలో అణుబాంబులు సహా అనేక వినాశకర వస్తువులను యుద్ధాల పేరుతో ఆయా ప్రాంతాలలో వినియోగించడం ద్వారా మానవాళికి సంవత్సరాల తరబడి వైకల్యం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు, సోషల్ మీడియా ఛైర్మన్ సన్ మూర్తి, జోషి, రాంప్రభు, పోతన, సత్యవతి, వెంకటరమణ, పరమేశ్వరరావు, రాధారాణి, విజయలక్ష్మి, మధుబాబు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన స్థలంలో చెత్త వేస్తే జరిమానా వేస్తాం అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన శానిటరీ సిబ్బంది

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన

పెదవాల్తేరు, జూన్ 5 : (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్వర్యంలో ఇటీవల గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలో పెదవాల్తేర్‌కు చెందిన ఎల్.గోవర్ధన్ కాంస్య పతకం సాధించాడు. తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు తన కార్యాలయంలో గోవర్ధన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, గెదేల నాగరాజు, కంబాపు శివారెడ్డి,, కోచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గోవర్ధన్‌ను సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 34, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 17, క్యారెట్ 36 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 140, కీరదోస 34, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

గంటాను కలిసిన డిప్యూటీ మేయర్



గంటాను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ గోవిందరాజు, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీని అభివృద్ధి బాట పట్టించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిప్యూటీ మేయర్‌ను గంటా సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకుని ప్రజల మన్ననలు పొందాలన్నారు. డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ ఛైర్మన్‌తో భేటీ..

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరి మధ్య నగరాభివృద్ధిపై చర్చ జరిగింది. అనంతరం వీఎంఆర్డీఏ ఛైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన ఫ్లోర్‌లీడర్ భీశెట్టి వసంతలక్ష్మీ పాల్గొన్నారు.

వృద్ధురాలిని రక్షించిన పోలీసులు

పెందుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ స్థితిలో వున్న వృద్ధురాలిని పోలీసులు రక్షించారు. గురువారం సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట ముత్యమాంబ కాలనీలో ఒక వృద్ధురాలి తన కూతురు, మనవడితో కలిసి నివసిస్తున్నది. ఈ క్రమంలో వృద్ధురాలి నగలను ఆమె మనవడు కుదవ పెట్టాడు. ఆ నగలు తెచ్చి ఇవ్వాల్సిందిగా పలుమార్లు వృద్ధురాలు తన మనవడికి చెప్పినా పెడచెవిన పెట్టాడు. దీంతో మనవడి ప్రవర్తనతో విసుగు చెందిన వృద్ధురాలు ఇంటిలో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్ లీకు చేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వృద్ధురాలి ఇంటి నుంచి గ్యాస్ వాసన రావటంతో ఇరుగు,పొరుగు వారు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో సీఐ సతీశ్‌కుమార్ తక్షణం స్పందించి పోలీసుల సహాయంతో ఇంటి తలుపులు పగులుకొట్టి గ్యాస్ లీకేజీని నియంత్రించారు. వృద్ధురాలికి సపర్యలు చేపి ఆమెను కోలుకునేలా చేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు.

10న కనకదుర్గమాంబ అనుపు మహోత్సవం



అమ్మవారి విగ్రహం



ఉత్సవాలకు సిద్ధం అవుతున్న కనకదుర్గమాంబ ఆలయం

వెంకోజిపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వవార్డు పరిధి ఇసుకతోట గ్రామ ఇలవేల్పు కనకదుర్గమాంబ వార్షిక పండుగ మహోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామమంతా మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ నెల 8న చాటింపు, 9న తొల్లేళ్లు, 10న అనుపు మహోత్సవం నిర్వహించనున్నట్టు శ్రీకృష్ణ యాదవ సేవా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, ప్రతినిధులు బొట్ట శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. ఈ నెల 8న చాటింపు, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 9న తొల్లేళ్ల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 10న అనుపు మహోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన జరుపునున్నారు. తెల్లవారు జాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించేందుకు వీలుగా ఏర్పాట్లను చేస్తున్నారు. సాయంత్రం పరస సంబరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు.

ఈ ఏడాది ప్రత్యేకంగా చాటింపు, తొల్లేళ్ల రోజున ప్రత్యేకంగా సంగీత విభావరిలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు.

ప్లాస్టిక్ నిరోధంతో పర్యావరణ పరిరక్షణ

- ఆర్ఎంపీ జోనల్ అధ్యక్షుడు జోషి



ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిరోధంతోనే పర్యావరణాన్ని కాపాడవచ్చని, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి అనుసరించాల్సిన ఉత్తమ విధానం ఇదేననిఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిరోధించాలని, మొక్కలు నాటాలనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభ కాలేజ్ అధినేత ఓం దీపక్ మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించకుంటే భావి తరాలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామన్నారు. మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ నిరోధంతో పాటు మొక్కలు నాటి నశించిపోయి ఓజోన్ పొరను పునరుద్ధరించడానికి సామాజిక బాధ్యతగా అందరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, గౌరవ సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, విశాఖ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శి లోకేష్, గణేష్, నాయక్, కౌసల్య,భవానీ, వెంకట్రావు, నరేంద్ర, జయరావు, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్-22810 విశాఖ-పారాదీప్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8, 15 తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

రైలు నంబర్-22809 పారాదీప్-విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 9, 16 తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అలాగే రైలు నంబర్-20807 విశాఖ-అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 10న ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను, రైలు నంబర్-20808 అమృతసర్ హిరాకుడ్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 14న ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నాణ్యత వల్లే సముద్ర ఉత్పత్తులకు విలువ పెరుగుతుంది

- ఎస్ఎస్ఎఫ్ ఎం.డీ. పద్మనాభం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మనాభం

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యత పెంచడం వల్లే దాని విలువ పెరుగుతుందని ఎస్ఎస్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పద్మనాభం అన్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ గురువారం విశాఖలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిష్ హార్వెస్టింగ్ ట్రైనింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన సముద్ర ఆహార విలువ జోడింపు అంతర్రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యతపై ఉత్పత్తిదారులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్య పరిశ్రమ ఆక్వా సాగులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అలాగే అవకాశాలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి పి.అనిల్ కుమార్, మాట్లాడుతూ సముద్ర ఆహార ప్రాసెసింగ్‌లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు.కార్యక్రమంలో మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ యారగల్, వైజాగ్ ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.లక్ష్మణరావు, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశాఖ రీజనల్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.కుజకుడాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన విశాఖపట్నం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక నగరంగా ఉన్న విశాఖలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు తమకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. వాహన కాలుష్యాన్ని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె రాజశేఖర్, విశాఖపట్నం డిపో మేనేజర్ కె గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం



కైలాసగిరిపై చెత్తను ఏరివేస్తున్న కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కైలాసగిరిపై ప్లాస్టిక్ రహిత కైలాసగిరి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ మానవ జీవన విధానం పర్యావరణ హితంగా ఉండాలని, విరివిగా ప్లాస్టిక్ వాడకం వల్ల భావితరాల మనుగడకు పెనుముప్పని, ప్లాస్టిక్ వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీర్ భవానీశంకర్, రామరాజు, దుర్గాప్రసాద్, రాంబాబు, సుజాతా శివానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిని పరిరక్షించడమే నా లక్ష్యం

- సివిల్ ఇంజనీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ
- అవగాహన కల్పిస్తూ ఆర్కే బీచ్ రోడ్డు నుంచి భీమిలి బీచ్ వరకూ 30 కిలోమీటర్ల రన్



మట్టి పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న చల్లా సుబ్రహ్మణ్య శర్మ

సిరిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మట్టిని పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో భావి తరాలకు తినడానికి సరైన తిండి కూడా దొరికే పరిస్థితులు ఉండవంటూ.. పర్యావరణ పరిరక్షణ మనందరికి ముఖ్య బాధ్యతగా తీసుకోవాలని సివిల్ ఇంజనీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన ఆయన వైజాగ్ నోవాటెల్ నుంచి భీమిలి బీచ్‌లోని నోవాటెల్ వరకు 30 కిలోమీటర్లు రన్ చేస్తూ పర్యావరణం, మట్టి పరిరక్షణపై జెండా పట్టుకొని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖకు చెందిన తనకు ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లోని చేపట్టిన మారథన్‌లోని పాల్గొనడం జరిగిందని, ఇప్పటి వరకూ 6140 కిలోమీటర్లు పరుగెత్తానని తెలిపారు. తనకు 56 ఏళ్లని, పర్యావరణంపై అవగాహన కలిగించాలన్నదే నా లక్ష్యమన్నారు. మట్టిని పరిరక్షించుకోకుంటే భవిష్యత్తులో సేంద్రీయ పంటలు పండే అవకాశమే లేదన్నారు. సేంద్రీయ పంటలు పడాలంటే కనీసం 12 శాతం మట్టి ఉండాలని అయితే ప్రస్తుతం 0.5 శాతం కూడా లేని దుస్థితి వచ్చిందన్నారు. దీన్ని ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.

బహిరంగ మార్కెట్‌కు రైతుబజార్ కూరగాయలు

» నరసింహనగర్ బజార్‌లో దందా
» పట్టించుకోని అధికారులు


బహిరంగ మార్కెట్‌కు తరలించడానికి ఆటోలో లోడ్ చేసిన కూరగాయలు


ఆటోలో తరలిస్తున్న కరివేపాకు


ఉల్లిపాయల బస్తా తీసుకెళ్తున్న వ్యాపారి

అక్కయ్యపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లో కూరగాయలకు కాళ్లొచ్చి బయటకు తరలిపోతున్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల సమయంలో రైతులు, డ్వాక్రా గ్రూపుల వారు తాజా కూరగాయలు, ఉల్లిపాయలు, టమాటాను బస్తాలతో బయట వ్యాపారులకు రైతుబజార్ నుంచి తరలిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బహిరంగ మార్కెట్లకు ఇలా తాజా కూరగాయలు తరలిస్తే తాము ఏం కొనుగోలు చేయాలని ప్రశ్నిస్తున్నారు.తాజా సరకులను బయటకు తరలించడం వల్ల మిగిలినవి కొనుగోలు చేస్తున్నామని, కొన్ని సమయాల్లో అయితే కూరగాయలు తమకు లభించడం లేదంటున్నారు. ఉదయం కార్యాలయాలకు వెళ్లాల్సిన వారు, వివిధ రకాల పనులు చేసుకుంటున్న తాము రైతుబజార్‌కు ఉదయాన్నే వచ్చి కూరగాయలు కొనుగోలు చేద్దామంటే ఇక్కడ విక్రయించడం లేదని ఆరోపిస్తున్నారు. ముందు బహిరంగ దుకాణాల వ్యాపారులకు బస్తాలతో తరలించిన తర్వాతే తమకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజలు తాజా కూరగాయలు కొనుగోలు చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్ ఏర్పాటు చేసిందని, అయినా బయట వ్యాపారుల హవానే ఇక్కడా సాగుతోందని అంటున్నారు. ఉదయం 10 గంటల తర్వాతే బహిరంగ దుకాణాలకు కూరగాయలు విక్రయించాలని, కానీ వారు ఈ సూచన పట్టించుకోకుండా ఉదయాన్నే రైతుబజార్‌కు వచ్చిన వెంటనే తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుబజార్ నుంచి కరివేపాకు, కూరగాయల మూటలను ఆటోల్లో తరలిస్తున్నారని చెబుతున్నారు. ఈ పోకడలను అధికారులు కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎస్టేట్ అధికారి కొండబాబును అడగ్గా.. ఈ విషయమై తమ వద్దకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయినప్పటికీ ప్రత్యేకంగా దృష్టి సారించి రైతుబజార్ నుంచి బహిరంగ మార్కెట్లకు కూరగాయలు తరలిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయం ఇప్పించాం... ప్లాంటును నడిపించాల్సింది వారే

... 5వ పేజీ తరువాయి

పనిచేయాలని చెబితే ఆ మాటలు...కొందరికి రుచించడం లేదు.

ప్ర : అధికారంలో ఉన్నది మీరే కాబట్టి షోస్ట్ కార్మికులు, యు-పాస్‌లపై చర్యలు తీసుకోవచ్చు కదా అంటున్నారు. అలా చేస్తారా?

జ: పని చేయకుండానే చాలామంది జీతాలు తీసుకున్నారు. మస్టర్ వేసి బయట తిరిగే వారు. కేంద్రం ఇన్‌చార్జిగా పంపిన సీఎండీ వాటన్నింటికీ అడ్డుకట్ట వేశారు. ఆ విషయాలనే నేను మాట్లాడాను. బ్లాస్ట్ ఫర్నేస్-3లో పని లేకపోయినా 700 మందిని కొనసాగిస్తున్నారు. పబ్లిక్ రంగ సంస్థలు నిబంధనల ప్రకారం పని చేస్తాయి. వాటిలో రాజకీయ జోక్యం ఉండదు. పక్కనే హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, భెల్ వంటి సంస్థలు ఉన్నాయి. వాటిలో ఎక్కడా రాజకీయ జోక్యం లేదనే విషయం గుర్తించాలి. యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పని చేసుకోవాలి. మమ్మల్ని అందులోకి లాగకూడదు.

ప్ర: కేంద్రం ఇచ్చిన నిధుల నుంచి తమకు జీతాలు ఇవ్వలేదని, బ్యాంకుల అప్పులు తీర్చడానికి, పన్నులు కట్టడానికే వాడారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దానికి ఏమంటారు?

జ: ప్లాంటు నడపడానికి అవసరమైన ముడి పదార్థాలు లేవని, అప్పు కూడా పుట్టడం లేదని, సాయం చేయాలని అడిగితే ఢిల్లీ పెద్దలను ఒప్పించి ఆ నిధులు ఇప్పించాము. వాటితో బ్యాంకుల అప్పులు తీర్చడం వల్ల వడ్డీ భారం తగ్గింది. మళ్లీ క్రెడిట్ నోట్లు జారీచేయడంతో ముడి పదార్థాలను తెచ్చుకోగలుగుతున్నారు. ఆ నిధులను జీతాలకు వాడేస్తే ప్లాంటు పరిస్థితి ఏమిటి? అందుకే అలా చేశారు.

ప్ర: కార్మికులను నిర్వాసితులు, కాంట్రాక్ట్ వర్కర్లు అని విడదీసి మాట్లాడుతున్నారని ఆరోపణలకు మీరు ఏమంటారు?

జ: ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ప్లాంటుకు ఏదైనా పని ఉన్నప్పుడు కాంట్రాక్ట్ వర్కర్లను పెట్టుకుంటారు. అవసరం లేనప్పుడు వారిని ఆపేస్తారు. ఇది అన్ని సంస్థల్లో ఉన్న విధానమే. ప్లాంటు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వారి సంఖ్య తగ్గించారు. దానికి వారు సమ్మె చేయడం, ఉద్యోగ, కార్మిక సంఘాలు మద్దతు పలకడం ఏ విధంగాను సమర్థనీయం కాదు. ఇక నిర్వాసితుల విషయానికి వస్తే...వారు ప్లాంటుకు భూములు ఇచ్చారు. ఉపాధి కల్పించాల్సిన బాధ్యత నాయకులుగా మాపై ఉంది. ఇంకో ఎనిమిది వేల మందికి ఉపాధి చూపించాల్సి ఉంది. అందుకే వారికి అండగా ఉంటామని చెప్పాను.

ప్ర: వంద శాతం ఉత్పత్తి సాధ్యమేనా?

జ: ఇప్పటివరకూ ఆ దిశగా యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు ప్రయత్నం చేయలేదు. ఎవరికి వారు విధులను పక్కనపెట్టి బయట పనులు చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నడిస్తేనే లాభాలు వస్తాయి. అప్పుడే నెలనెలా జీతాలు అందుతాయి. అవసరమైనవన్నీ సమకూర్చాము కాబట్టి కష్టపడి పనిచేసి పూర్తి ఉత్పత్తి తీయాల్సిందే. ఇది వ్యాపారం. పోటీగా పనిచేసినప్పుడే నిలబడతారు.

ప్ర: విశాఖ స్టీల్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపించవచ్చు కదా అంటున్నారు?

జ: గత సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాలు కలిసి విద్యుత్ బిల్లులు కట్టడానికి మూడు నెలల సమయం అడిగితే...మీరు కట్టకపోతే ఎవరు కడతారని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడే ఏమీ అనలేదు. ఇప్పుడు మేము విద్యుత్ బిల్లులు, నీటి చార్జీలు, ఆస్తి పన్ను అన్నీ రెండేళ్ల వరకూ ఒత్తిడి లేకుండా చేశాము. దానిపై ఎవరూ మాట్లాడరు. వంద శాతం ఉత్పత్తి తీసి, మా దగ్గర స్టీల్ నిల్వలు ఉన్నాయని చెబితే తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వంతో కొనిపిస్తాం. అంతేకాకుండా రెండేళ్ల 100 శాతం ఉత్పత్తి చేసి, లాభాలు చూపిస్తే సెయిల్‌లో విలీనం చేయిస్తాము. అదే మా లక్ష్యం.

అంతర్జాతీయ విలువిద్య పోటీలకు గణేష్ మణిరత్నం

» రూ.50 వేలు ఆర్థిక సాయం అందించిన సూర్యనారాయణరెడ్డి



విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 5 : అంతర్జాతీయ అర్చరీ చాంపియన్‌షిప్‌టోర్నీకి నగరానికి చెందిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి గణేష్ మణిరత్నం ఎంపికయ్యాడు.పుణెలో జరిగిన భారత జట్టు ఎంపిక పోటీల్లో గణేష్ మణిరత్నం అద్భుతంగా రాణించి తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. దీంతో త్వరలో కెనడాలో జరగనున్న వరల్డ్ యూత్ అర్చరీ చాంపియన్‌షిప్, సింగపూర్‌లో జరగనున్న ఏషియన్ కప్ స్టేజ్-2 అర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్నాడు.

గత ఏడాది ఐర్లాండ్‌లో జరిగిన వరల్డ్ యూత్ అర్చరీ చాంపియన్‌షిప్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం, కొరియాలో జరిగిన ఆసియా కప్ అర్చరీ టోర్నీలో కాంస్య పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన ఈవెంట్‌లో గణేష్‌మణిరత్నం మరోసారి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ టోర్నీకి అర్హత సాధించడంపై ఉమ్మడి విశాఖ అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం తరఫున మణిరత్నం క్రీడా అవసరాల నిమిత్తం రూ.50 వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా అర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు తీసుకొచ్చిన క్రీడా విధానాల్లో భాగంగా ప్రభుత్వ- ప్రైవేటుభాగస్వామ్యంతో సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన గణేష్‌మణిరత్నం అంతర్జాతీయ స్థాయికి చేరడం విశేషమన్నారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని అంతర్జాతీయ పతకాలు అందించి రాష్ట్ర, జిల్లా క్రీడారంగాలకు గర్వంగా నిలవాలని ఆకాంక్షించారు.

మొక్కలనునాటి ప్రత్యేక శ్రద్ధతో పరిరక్షించాలి

» ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పాల్గొన్న నేత్ర వైద్యశాల వైద్యులు

సీతమ్మధార, జూన్ 5, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, జీవీఎంసీ, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులో గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలను కనుపాపల వలే సాకాలన్నారు. విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాడానికి యువత నడుము బిగించి గడగడపకు అమ్మపేరుతో ఒక మొక్క నాటాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశయాన్ని నేరవేర్చాలని పిలుపునిచ్చారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రజలందరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యశాల ప్రధాన సంచాలకులు డాక్టర్ వేప మీనాక్షి, బీజేపీ వైద్య విభాగ కన్వీనర్ రవికుమార్, జీవీఎంసీ యునిసెఫ్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస రాజమణి, నేత్ర వైద్యశాల వైద్యులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ నవీన్ కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఎండ..వాన

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఒక్కసారిగా నగరం, పరిసరాల్లో మేఘాలు ఆవరించాయి. ఈదురుగాలులు వీచాయి. మధురవాడ, ఎండాడ, విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీ,మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో సుమారు 45 నిమిషాలసేపు వర్షం కురిసింది. మధురవాడ జాతరలో 54.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే విచిత్రంగా సత్యం జంక్షన్ నుంచి...ఇటు ఎన్‌ఏడీ వైపు చినుకులేదు. అక్కయ్యపాలెం, కంచరపాలెం, మిగిలిన ప్రాంతాల్లో గాలులు తప్ప వర్షం పడలేదు.

విశాఖకు 'సత్వా'?

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నారు. దీంతో పాటు బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ నిర్మించిన యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం కూడా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీన గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం వస్తున్నారు. ప్రొటోకాల్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా హాజరవుతున్నారు.

గెడ్డ ఆధునికీకరణకు శంకుస్థాపన

దొండపర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 27వ వార్డు దొండపర్తి సాయిబాబా ఆలయం దగ్గర రూ.41 లక్షలతో గెడ్డ అడుగు భాగంలో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ సభ్యుడు గొలగాని వీరారావు బుజ్జి గురువారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. మండావారి వీధిలో సీబీఎం ప్రాథమిక పాఠశాల పనులు, దొండపర్తి రజక వీధిలో దోబీఘాట్, సామాజిక భవన నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

ఉల్టా...పల్టా

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడం వంటి అంశాలపై నిలదీయాలని మరికొందరు భావిస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా గుర్తింపు పొందిన జీవీఎంసీకి ఐదు నెలలుగా కమిషనర్‌ను నియమించకపోవడాన్ని కూడా కౌన్సిల్‌లో ప్రస్తావించా లని నిర్ణయించినట్టు తెలిసింది. ఆరిలోవ, మల్కాపురం ఫస్ట్ రిఫరల్‌యూనిట్ (జీవీఎంసీ ఆస్పత్రులు)ను బెహరా గ్రూపునకు అప్పగించడంలో లొసుగులపై కూడా కూటమి సభ్యులుచర్చకు లేవనెత్తే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో జీవీఎంసీ పరిధిలో జారీచేసిన టీడీఆర్‌లు,కూర్మన్నపాలెంలో ఎంవీవీ, ఎంకే అ పార్టుమెంట్ నిర్మాణంలో అక్రమాలపై కూడా చర్చకు పట్టుబట్టాలని కూటమిలోని కార్పొరేటర్లు కొందరు భావిస్తున్నారు. కూటమి కార్పొరేటర్లే కౌన్సిల్‌లో విపక్షపాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తుండడంతో సమావేశం ఎలా జరుగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కాపుజగ్గరాజుపేటల్లో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలు, శొంఠ్యాంలో ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ, నరవలోని విట్స్) కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష 1,940 మంది అభ్యర్థులు రాస్తారు.

ప్రిన్సిపాల్, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు మూడు గంటలు, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2.30 గంటలు, ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్షకు 1.30 గంటల సమయం కేటాయించారు. దీంతో కొన్ని పరీక్షలు ఉదయం 9 గంటలు, మరికొన్ని 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం సెషన్‌లో 2 గంటలు, 2.30 గంటలకు మొదలవుతాయి. ఇంగ్లీష్ భాషపై అవగాహన కోసం నిర్వహించే పరీక్ష మాత్రం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారు.

పరీక్షలు సజావుగా నిర్వహణకు ప్రతి కేంద్రానికి ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. డైట్ ప్రిన్సిపాల్ (ఫోన్ నంబరు 9949993730) ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేశారు. పరీక్షల నిర్వహణను విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించనున్నారు. గురువారం డిపార్టుమెంటల్ అధికారులతో డీఈఓ సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఇతరత్రా సాయం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ (9849739920, 9177292969, 8328525861) ఏర్పాటుచేసినట్టు డీఈవో తెలిపారు. అభ్యర్థులు ముందుగా కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జీవీఎంసీ, సచివాలయ ఉద్యోగులు



వాకర్స్ పార్కులో జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న జడ్సీ బి. రాము



మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సమష్టి కృషితోనే పర్యావరణానికి రక్షణ

మాధవధార, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరంలోని మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జోన్-5 జడ్సీ బి. రాము మాట్లాడుతూ అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలిపారు. అనంతరం వాకర్స్ క్లబ్ పార్కులో మొక్కలు నాటారు. పార్కు కళా వేదిక వద్ద దాతలు సమకూర్చిన జ్యూట్ బ్యాగులను స్థానికులకు అందజేశారు. వాకర్స్ పార్క్ అధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ కార్యదర్శి సెల్వరాజు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి, బీజేపీ 50వ వార్డు అధ్యక్షుడు కూన వెంకటరావు, టీడీపీ అధ్యక్షుడు ఎస్. వరప్రసాద్ పాల్గొన్నారు.

53వ వార్డులో...

మర్రిపాలెం :గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెంలో సచివాలయం, జీవీఎంసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో పలు కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

విశాఖపట్నం : ప్రభుత్వ మహిళా కళాశాలలోవైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నివేదిత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య, విద్యార్థినులు పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం 'ప్లాస్టిక్ పొల్యూషన్ నిషేధం'అన్న అంశంపై వృక్ష శాస్త్ర విభాగాధిపతి నివేదిత మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అంగన్వాడీ కేంద్రంలో..

మురళీనగర్ : గ్రేటర్ 51వ వార్డులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలబాలికలు, స్థానిక మహిళలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని చేసే వస్తువులు వాడకూడదని ప్లకార్డులు పట్టి అంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వరలక్ష్మి, గాంధీ నగర్ నివాసితులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డైమాండ్ పార్కులో...

దొండపర్తి :గ్రేటర్ 27వ వార్డులోని డైమాండ్ పార్కులో వార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధురి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి హాజయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లూరి సత్యనారయణరెడ్డి, శివప్రసాద్,వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో...

సీతమ్మధార : సీతమ్మధారలో ఉన్న ఈపీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో సంస్థ డైరెక్టర్లు చంద్రం, టీవీ సూర్యప్రకాష్, సీజీఎం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు సుమన్ కల్యాణి, వి. విజయలలిత, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణ పేర్కొన్నారు. కళాశాల్లో పర్యావరణం పరిరక్షణ, ప్లాస్టిక్ భూతం తీవ్రత తగ్గించడం అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగం అధికమైందన్నారు. వినియోగించిన ప్లాస్టిక్‌ను తిరిగి వివిధ రూపాల్లో రీసైకింగ్ చేయడం ద్వారా పెనుముప్పును తగ్గించవచ్చునన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గల త్రిస్టార్ వాకర్స్ క్లబ్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

వాల్తేరు రైల్వేలో...

విశాఖపట్నం : వాల్తేరు రైల్వేలో ప్రపంచ పర్యావరణ దినోత్సం ఘనంగా నిర్వహించారు.. ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ, ఇ.శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొని డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో మొక్కలు నాటి, బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఉపాధ్యక్షులు మధుమిత సాహూ, కార్యదర్శి అంకిత శర్మ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి కృషి చేయాలని 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.అప్పారావు ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్, జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. 44వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్ట్ పార్కులో పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాకర్లకు అబిద్‌నగర్ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వెంకటపతి రాజు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం బజార్‌లోనూ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సెక్రటరీలు అలిమ, ఫాతిమా, నానాజీ, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాత నగరంలో..

మహారాణిపేట : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ సీనియర్ నాయకుడు గోడి నరసింహాచారి అన్నారు. వన్ టౌన్‌లో టౌన్ హాల్ ప్రాంతంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జి. విజయలక్ష్మి, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా కళాశాలలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మజ, రత్నశేఖర్, శ్రావణ్‌రాజు, వెంకట్, దిలీప్ పాల్గొన్నారు. 31వ వార్డు పరిధిలోని సెంట్రల్ పార్కులోనూ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం. కామేశ్వరరావు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీ సూపర్‌వైజర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో...

విశాఖపట్నం : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కుంచె పేర్కొన్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆనందపురం వద్ద జాతీయ రహదారి-16పై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ఎన్‌హెచ్ ఏఐ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు.


మొక్కలు నాటిన వాల్తేరు రైల్వే ఏడీఆర్‌ఎంలు, ఇతర అధికారులు


మొక్కలు నాటుతున్న అధికారులు

పాఠశాలలకు విద్యార్థి కిట్లు

... 5వ పేజీ తరువాయి

8,618 మంది, విశాఖ అర్బన్‌లో 8,365 మంది, భీమునిపట్నంలో 8,014 మంది, సీతమ్మధారలో 7,512, పెందుర్తిలో 7,102, గాజువాకలో 6,224, ఆనందపురంలో 4,239, పెదగంట్యాడలో 3,664, పద్మనాభంలో 3257, ములగాడ మండలంలో 3,148 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతులను బట్టి మూడు సైజులలో కిట్లు సరఫరా చేశారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ పిక్టోరియల్ డిక్షనరీ, ఆరో తరగతి నుంచి ఆక్స్‌ఫర్డు డిక్షనరీ అందజేస్తారు. యూనిఫారానికి సంబంధించి క్లాత్ ఇస్తారు. విద్యార్థులు కుట్టించుకోవాలి. టైలర్ మజూరీ ఖర్చు విద్యార్థి తల్లుల ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తోంది. కాగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, సీఎంవో దేముడుబాబు జిల్లాలో స్టాకు పాయింట్ల వద్ద కిట్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం బ్యాగులు పంపిణీ చేయడంతో నెల, రెండు నెలల్లో జిప్‌లు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం, నాణ్యమైన బ్యాగుల సరఫరాపై దృష్టిసారించింది. ఈనెల 12న పాఠశాలల పునః ప్రారంభం రోజున తల్లిదండ్రుల కమిటీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఉన్నత పాఠశాలల్లో స్కూలు రెడీనెస్ కార్యక్రమం నిర్వహిస్తామని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు.

వచ్చే నెల 9, 10 తేదీల్లో సింహగిరి ప్రదక్షిణ

... 5వ పేజీ తరువాయి

నుంచి పదో తేదీ సాయంత్రం వరకూ దర్శనాలు ఉంటాయన్నారు. కొండ దిగువన తొలి పావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని సూచించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈవో సూచనల మేరకు అవసరమైన అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. స్టాళ్లు పెట్టుకునే వారికి ముందుగా అనుమతి ఇచ్చి సంబంధిత మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. భక్తులకు అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. కొండపై అగ్నిమాపక శకటం, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. తొమ్మిదో తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టడం ద్వారా గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. పదో తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామి వారికి నాలుగో విడత చందన సమర్పణ జరుగుతుందని వివరించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు

ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగినట్టుగా కొబ్బరికాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కొండపైన 170, దిగువన 58 సీసీ కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటుచేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



72వ వార్డులో మొక్కలు నాటిన అనంతరం ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న జడ్సీ శేషాద్రి, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, తదితరులు



88వ వార్డు గ్రీన్ సిటీలో మొక్కనాటి నీరు పోస్తున్న వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, తదితరులు


ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో మొక్క నాటుతున్న ఐలా కమిషనర్ ఎ.కిశోర్, రఘు, పాండురంగప్రసాద్, తదితరులు

మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకోవాలి

» గాజువాక జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి

» 100 రోజుల్లో 10 లక్షల మొక్కలు నాటుతాం: వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్

» పలు ప్రాంతాల్లో ఘనంగా పర్యావరణ దినోత్సవం

గాజువాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 72వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటడాన్ని ప్రజలందరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. ఏదో ఒక శుభ సందర్భంలో మొక్కలు నాటాలని కోరారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, టీడీపీ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లక్ష్మణరావు, సీహెచ్ కన్నారావు, స్థానిక నాయకులు రామారావు, సత్యనారాయణ, జి.ఆనంద్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ప్రకృతి వైపరీత్యాల నుంచి భూగోళాన్ని రక్షించుకునేందుకు అందరూ విరివిగా మొక్కలు నాటాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. స్థానిక మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో అందరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని బాధ్యతగా పెంచాలన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, సచివాలయ, ప్రజారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే 76వ వార్డు పరిధి అమరావతి పార్కులో జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రజారోగ్యశాఖ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 79వ వార్డు పరిధిలోని గల్లవానిపాలెం, షిర్డీ సాయినగర్, జనచైతన్యనగర్ పార్కు వద్ద కూటమి నాయకులతో కలిసి వివిధ రకాలు మొక్కలను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ నాటారు. నాయకులు కరణం జగదీశ్, ఎం.విజయ్, హనిత, రుద్రకుమార్, సూర్యనారాయణ, సుబ్బరాజు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. అలాగే 85వ వార్డు డొకాండలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటగా, సత్రం జంక్షన్‌లో మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు మొక్కలను పంపిణీ చేశారు.


వీఎస్ఈజడ్ ఆవరణలో మొక్కలు నాటిన రోషిణి అపరంజి కొరాటి, తదితరులు

ఆటోనగర్: ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో ఐలా, విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐలా కమిషనర్ ఎ.కిశోర్, చైర్మన్ రఘు (సత్యనారాయణరెడ్డి), వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్‌లు మాట్లాడుతూ కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం పలువురికి మాస్కులు, టోపీలను పంపిణీ చేశారు. ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, మాజీ చైర్మన్లు ఎస్.శేషగిరిరావు, యార్లగడ్డ సాంబశివరావు, ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, ప్రభాకర్‌కుమార్, తదితరుల చీపుర్లతో వీధులను శుభ్రం చేశారు. ఎంఎస్ఎంఈ ఏడీ శ్రీనివాస్, వాసీవా, ఐలా ప్రతినిధులు పద్మావతి, ఎల్.బాపిరాజు, కృష్ణప్రసాద్, పరుచూరి ప్రభాకర్, రామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ అన్నారు. 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలో పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిలుపు మేరకు 100 రోజుల్లో 10 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. భావితరాల వారి భవిష్యత్తును పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ గ్రీన్ సిటీ, పరవాడ, కొత్తవలస, బీసీ రోడ్డు, గ్రీన్ సిటీ హైట్స్ హోమ్స్ టెంపుల్, సింహాద్రి టీఎంటీ రోల్ మిల్స్ స్కూళ్లు, కణితి సీఎఫ్ఎస్ యార్డు, కార్పొరేట్ కార్యాలయం, కల్యాణ మండపం, తదితర ప్రాంతాల్లో మొక్కలను నాటామన్నారు. పర్యావరణ పరిరక్షణలో దేశంలో విశాఖ నగరం మూడో స్థానంలో ఉందని, మొదటి స్థానాన్ని సాధించేందుకు అందరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ సభ్యులు చిన్న సురేశ్, రమేశ్, మల్లికార్జున్, చంద్రశేఖర్, గణేశ్, సునీల్, నానాజీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

అలాగే దువ్వాడ వీఎస్ఈజడ్‌లో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ జేడీసీ రోషిణి అపరంజి కొరాటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత జీవనాన్ని గడపాలంటే అందరూ కాలుష్య నివారణకు, ఆక్సిజన్ పెంపుదలకు మొక్కలు నాటాలని కోరారు. ఏడీసీ ప్రసన్నకుమార్, శ్రీకాంత్, పలు యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా దువ్వాడ వీఎస్ఈజడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ డీఎండీ బీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పీఆర్వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో ప్లకార్డులు, బ్యానర్లు, ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న దృశ్యం

తిరుమలనగర్‌లో స్వచ్ఛ భారత్ ర్యాలీ

కూర్మన్నపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ ర్యాలీని నిర్వహించారు. అందరూ మొక్కలు నాటాలని, నిషేధిత ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ బాక్సులు, క్లాత్ సంచులను వినియోగించాలని, భూగర్భ జలాల సంరక్షణకు ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, కాలుష్య నివారణకు విధిగా ఇంటికొక మొక్కను నాటాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, వార్డు నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, ఇజ్రాయిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, లక్ష్మి, రాణి, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో..

దువ్వాడ రైల్వే స్టేషన్-1 ప్లాట్‌ఫారమ్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి, రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కామేశ్వరరావు, రవి, లక్ష్మి, మానవవనరుల సంఘం సభ్యుడు రైల్వే సిబ్బంది ఎంఎస్ రావు, పల్లవి, సుజాత, ఆర్పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అగనంపూడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెదముషిడివాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ లంకెలపాలెం సెక్షన్ ఏఈ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పెదముషిడివాడ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలతోపాటు, ఇ-మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, వినాయకనగర్, గొన్నవానిపాలెం, కన్నూరు, మంత్రిపాలెం, లంకెలపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెదగంట్యాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి గరుడాద్రిపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం యాగశాల ప్రవేశం, అంతరాలయ దేవత పూజ, మూర్తి, కుంభ, వాస్తు, యోగీశ్వర, తదితర పూజాది కార్యక్రమాలను జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, ప్రతినిధులు శ్రీరామమూర్తిరాజు, పార్వతీదేవి, అప్పలరెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శేష, గరుడ వాహనాలపై ఊరేగిన శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీవారికి పెద్ద శేష, గరుడ వాహన సేవలను వైభవంగా నిర్వహించారు. యాగశాలలో ఉదయం ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక హోమాలు జరిపారు. అనంతరం ఎస్టీబీఎల్ మాడవీధుల్లో శ్రీవారిని ఊరేగించారు. ట్రస్టీలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభం

అగనంపూడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అన్నపూర్ణానగర్‌లో నిర్మించిన శ్రీపూర్ణ మహాగణపతి ఆలయాన్ని గురువారం ఆలయ కమిటీ, కాలనీ అసోసియషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. శ్రీపూర్ణ మహాగణపతి విగ్రహాన్ని వేదపండితులు ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక నాయకుడు కరణం జగదీశ్, అసోషియేషన్ ప్రతినిధులు ఎం.వెంకటరావు, ఎం.అప్పారావు, డి.సన్యాసిరావు, మూర్తి, డి.దేముడు, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సమజాభివృద్ధి కోసం సేవలందించిన వ్యక్తులకు మంచి గుర్తింపు లభిస్తుందని డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగాధిపతి సుక్క రమణరావు చేసిన సేవలకు గాను గురువారం స్టీల్ క్లబ్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ ఎస్టీఎం విభాగాధిపతిగా రమణారావు చేసిన సేవలను కొనియాడారు. ప్రతినిధులు బి.జగ్జీవన్‌రామ్, బోసుబాబు, ఠాగూర్, సంజీవరావు, వసంతరావు, ఆదినారాయణ, అయోధ్యరామ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

ఆటోనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగ ఉన్నవారంతా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఐలా కమిషనర్ ఎ.కిశోర్, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్ అన్నారు. ఆటోనగర్ వాసీవాలో గురువారం వరల్డ్ బ్లడ్ డోనర్ డేను పురస్కరించుకుని మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఐలా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరమన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. పారిశ్రామికవేత్తలు యార్లగడ్డ సాంబశివరావు, కొల్లి ఈశ్వరరావు, రామప్రసాద్, పరుచూరి ప్రభాకర్, చీకటి సత్యనారాయణ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఇస్లాంపేట జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి ఉచితంగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.

అగనంపూడి కాలేజీలో బైపీసీ గ్రూపు..

అగనంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బైపీసీ గ్రూపు మంజూరైనట్టు ప్రిన్సిపాల్ జి.సుధాకరబాబు తెలిపారు. గతంలో ఇక్కడ సైన్స్‌కు సంబంధించి బైపీసీ గ్రూపు లేకపోవడంతో స్థానికంగా విద్యార్థులు ప్రైవేటు కళాశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకుళ్లడంతో ఆయన ఇంటర్ బోర్డు అధికారులతో మాట్లాడి బైపీసీ గ్రూపు మంజూరు చేయించారు. ఈ ఏడాది నుంచే బైపీసీ గ్రూపులో ప్రవేశాలకు అనుమతి లభించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బైపీసీ గ్రూపులో చేరవచ్చని, మరిన్ని వివరాలకు కళాశాలను సంప్రదించాలని కోరారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 34, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 17, క్యారెట్ 36 దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 84, అల్లం (పాతది) 52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 140, కీరదోస 34, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, గోరుచిక్కుడు 40, దేముడు చిక్కుడు 64, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

ములగాడ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్


ములగాడ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయిన దృశ్యం

మల్కాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ములగాడ రోడ్డులో గురువారం రెండు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎండలో మాడిపోయారు. ఈ మార్గం గుండా నగరంలోకి వెళ్లేందుకు గూడ్స్ రైలు అడ్డుగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. డాక్‌యార్డుకు సమీపంలో ఉన్న సర్దార్ వల్లాభాయ్ పటేల్ వంతెన పునఃనిర్మాణం జరుగుతుండడంతో ములగాడ మార్గం గుండానే ఈ ప్రాంతవాసులు నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో పట్టాలపై గూడ్స్ రైలు ఆగిపోయింది. రైలు రెండు గంటలు నిలిచిపోవడంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. ఓ వైపు నెత్తిన సూరీడు సర్రుమంటున్నాడు.. మరోవైపు గాలి లేకపోవడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవించారు. అయినా ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా ఈ మార్గం వద్దకు చేరుకోలేదు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'నాణ్యమైన కూరగాయలను అందుబాటులో ఉంచాలి'


మర్రిపాలెం రైతుబజారును సందర్శిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, తదితరులు

ఎన్.ఎ.డి జంక్షన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన కూరగాయలను వినియోగదారులకు అందుబాటులో ఉండేలా రైతుబజార్ నిర్వాహకులు చూడాలని మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఉదయం మర్రిపాలెం రైతుబజారును డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుతున్నాయా.. లేదా.. రైతుబజార్ వసతులపై ఆరా తీశారు. రైతుల అవసరాలు, అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అమలు అయ్యేలా కృషి చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్లు ఎలమంచిలి లలితకుమారి, టి.పద్మజ, టీడీపీ వార్డు అధ్యక్షుడు వైటీఆర్, బలభద్ర రాజు, శ్రీనివాసరెడ్డి, ఎస్టేట్ అధికారి నారాయణ రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట భూముల నిర్వాసితుల నిరసన


వేపగుంటలో నినాదాలు చేస్తున్న రైతులు

వేపగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేపగుంటలో 144 ఎకరాల్లో వీఎంఆర్‌డీఏ చేపట్టిన చదును పనులను వ్యతిరేకిస్తూ నిర్వాసిత రైతులు గురువారం నిరసన చేపట్టారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వీఎంఆర్‌డీఏ పనులు చేయడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసనలో వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు భూములను ఇవ్వడానికి సమ్మతి తెలియజేసినా ముందస్తు సమాచారం లేకుండా పనులు చేయించడం అధికారులకు తగదన్నారు. గతంలో జరిగిన చర్చల సమయంలో ప్యాకేజీ, కొన్ని డిమాండ్‌లను అధికారుల ముందు ఉంచామని, వాటిపై స్పష్టత ఇవ్వకుండా పనులు చేయడాన్ని ఆయన మండిపడ్డారు. అధికారులు రైతులకు ముందుగా పరిహారం చెల్లించాలని, లేకుంటే పక్కాగా హామీని ఇచ్చి పనులు చేయాలని సూచించారు. సాలాపు రమణ, దేముడు, అప్పారావు, సంజీవ్ రైతులు పాల్గొన్నారు.

రాంపురంలో వికసిత్ కృషి సంకల్ప్

పెందుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురంలో గురువారం కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంతో ఖరీఫ్ రైతులకు పెట్టుబడి సాయాన్ని అందజేస్తుందన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కరుణాకర్, సమన్వయకర్త కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని దెబ్బతీస్తే ప్రళయం

» మేయర్ పీలా శ్రీనివాసరావు



పెందుర్తిలో మొక్క నాటుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని దెబ్బ తీస్తే ప్రళయం వస్తుందని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. గురువారం పెందుర్తి ఆదిత్యనగర్‌లో జీవీఎంసీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ నాటడంతోపాటు వాటి సంరక్షణ ముఖ్యమన్నారు. అనంతరం ఆర్‌జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమన్నారు. కార్యక్రమంలో జడ్సీ హేమవతి, పీలా జితేంద్ర, నరవ అచ్చింనాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వేపగుంటలో..

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూ ప్రజలను చైతన్యపరచాలని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జోన్ 8 ఆధ్వర్యంలో 96వ వార్డు ఆదిత్యా కాలనీలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే హైమావతి, ఏఎంహెచ్ఓ బండారు అప్పలనాయుడు, డీఈ ప్రవీణ్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్కాపురంలో..

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం 60వ వార్డు ఎంబీజీ కాలనీలోని పార్కులలో వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రత్నం, ఆడారి శివ, సూర్య ప్రాజెక్ట్ శ్రీనివాస్, రాజేష్, రాధ, బొమ్మిడి శ్రీను, ఎంబీజీ శ్రీను, సతీష్, సంతోష్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానంలో వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ శ్రీహరిపురం అధ్యక్షుడు టి.సతీష్, బీజేపీ సెక్రటరీ వసుంధర, వార్డు సీవో మహాదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే 58వ వార్డులో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, వార్డు ప్రధానకార్యదర్శి పొత్తబత్తుల శ్రీనివాసరావు, టీడీపీ మహిళ నాయకురాలు సావిత్రి మొక్కలు నాటారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో అధికారులు సంస్థ మెయిన్ గేటు నుంచి సింధియా జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీని డైరెక్టర్ (సీపీఅండ్) రాకేష్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారి సంజీవ్ కుమార్ పాత్రో, 300 మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న షిప్‌యార్డు డైరెక్టర్ రాకేష్ ప్రసాద్

62 వార్డులో..

62వ వార్డు దుర్గానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు.

వృద్ధురాలిని రక్షించిన పోలీసులు

పెందుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ స్థితిలో వున్న వృద్ధురాలిని పోలీసులు రక్షించారు. గురువారం సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట ముత్యమాంబ కాలనీలో ఒక వృద్ధురాలి తన కూతురు, మనవడితో కలిసి నివసిస్తున్నది. ఈక్రమంలో వృద్ధురాలి నగలను ఆమె మనవడు కుదవపెట్టాడు. ఆ నగలు తెచ్చి ఇవ్వాల్సిందిగా పలుమార్లు వృద్ధురాలు తన మనవడికి చెప్పినా పెడచెవిన పెట్టాడు. దీంతో మనవడి ప్రవర్తనతో విసుగు చెందిన వృద్ధురాలు ఇంటిలో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్ లీకు చేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వృద్ధురాలి ఇంటి నుంచి గ్యాస్ వాసన రావటంతో ఇరుగు,పొరుగు వారు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో సీఐ సతీశ్‌కుమార్ తక్షణం స్పందించి పోలీసుల సహాయంతో ఇంటి తలుపులు పగలుకొట్టి గ్యాస్ లీకేజీని నియంత్రించారు. వృద్ధురాలికి సపర్యలు చేసి ఆమెను కోలుకునేలా చేసి ప్రాణాపాయం నుంచి రక్షించారు.

షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికుల భద్రతపై అవగాహన

మల్కాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికులు ఆరోగ్యపరంగా గానీ, భద్రత పరంగా గానీ తీసుకోవాల్సిన చర్యలపై సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎవరైనా గుండెపోటుతో కిందపడిపోతే వెంటనే ఆ వ్యక్తి చాతిపై నాలుగు నుంచి ఐదు సెంటీమీటర్లు లోతుగా ప్రెస్‌చేయాలి. అలా 30 సార్లు ప్రెస్ చేయాలని వివరించారు. ఈ విధంగా చేయడం వలన ఆ వ్యక్తి ప్రాణపాయం నుంచి బయటపడతారన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధం

అంధత్వాన్ని జయించిన కావ్యపూర్ణిమ

మధురవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): **జీవితంలో ఎదురైన అడ్డంకులను అవకాశాలుగా మలచుకుని ఎలా నిలదొక్కుకోవచ్చునో ఓ యువతి నిరూపించింది. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మలచుకుంది. 2017 వరకు లోకాన్ని చూడగలిగినా, అనుకోని వ్యాధి కారణంగా అంధకారం ఆవరించింది. అయినా తాను కోరుకున్న బ్యాచులర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) పట్టాను సాధించింది. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీకి చెందిన కావ్యపూర్ణిమ బలిజేపల్లి జీవితం స్ఫూర్తిదాయకం.**

శ్రీకాకుళానికి చెందిన కావ్య తన ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసాన్ని అక్కడ కేంద్రీయ విద్యాలయంలో పూర్తి చేసింది. పదో తరగతి, ఇంటర్ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివి, ముంబయి యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ కోర్సులో చేరింది. ఆఖరి సంవత్సరంలో ఉండగా పోలీసిస్టిక్ ఓవరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్) కారణంగా ఆసుపత్రిలో చేరింది. ఆమెకు రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందించారు. కొన్నాళ్లు బాగానే ఉన్నప్పటికీ, తరువాత తీవ్రమైన తల, మెడ, కళ్లనొప్పులతో బాధపడింది. అది మైగ్రేన్ గానే అందరూ భావించారు. కానీ ఓ రోజు రాత్రి నిద్రపోయి ఉదయం లేచి కళ్లు తెరిచేసరికి అంతా చీకటిగా కనిపించింది. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు పూర్తయ్యాక కావ్య ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్‌టెన్షన్ (ఐఐహెచ్) అనే అరుదైన నాడీ వ్యవస్థ రుగ్మతకు గురైనట్లు నిర్ధారించారు. దీంతో కుడికన్ను 98 శాతం, ఎడమ కన్ను పూర్తిగా చూపు కోల్పోయాయి. కంటి వెలుగు పొందడానికి ఐదు శస్త్రచికిత్సలు చేయించుకున్నా ఫలితం లేకపోయింది. సుమారు రెండేళ్లు చదువుకు ఆటంకం కలిగినా, అనుకున్న లక్ష్యం కోసం పోరాడి చివరకు అదే యూనివర్సిటీ నుంచి బీఆర్క్‌లో డిగ్రీ పొందింది.


వైజాగ్‌మారథాన్‌లో కావ్య..



దివ్యాంగుల హక్కుల కోసం అవగాహన శిబిరంలో..

తన ఇల్లే జీవిత పాఠం

కావ్య తండ్రి వెంకటరమణశాస్త్రి సామాజికవేత్త, తల్లి లక్ష్మి గృహిణి. వీరిది ఉమ్మడి కుటుంబం. అంతా కలసి శ్రీకాకుళంలోని మండువా లోగిళ్లలో నివసించేవారు. కావ్యను ఆకర్షించిన ఆ ఇల్లే తన జీవిత పాఠంగా ఎంచుకుంది. ఆ కల నెరవేరడానికి ఆర్కిటెక్చర్ కోర్సు చేయాలనుకుంది. ఇందులో భాగంగా అధ్యయన యాత్ర (స్టడీటూర్)కు వెళ్లింది. అమరావతి, తిరుపతి, మహాబలిపురం లాంటి చోట్ల శిల్పకళారీతులు, పురాతన కట్టడాలను పరిశీలించింది. కావ్యకు శాస్త్రీయ నృత్యం, వీణా వాయిద్యంలోనూ ప్రావీణ్యం పొందింది.

2021లో 'పూర్ణమిదం' ఏర్పాటు

తనలా సమాజంలో వేరొకరు బాధపడకూడదనే దృక్పథంతో కావ్య 'పూర్ణమిదం' అనే ఎన్‌జీఓ సంస్థను ఏర్పాటు చేసింది. పరిశోధనలు, ప్రణాళిక, టూరిజం పాలసీ, ఆర్కిటెక్చర్‌లో ఉచితంగా సలహాలు, సూచనలు ఇస్తోంది. 2017లోనే ఐఐహెచ్ వారియర్స్ అనే ఆన్‌లైన్ గ్రూప్ ఏర్పాటు చేసి అలాంటి రుగ్మతలతో బాధపడుతున్నవారికి తన సహాయాన్ని, తాజా సమాచారాన్ని అందిస్తోంది. ఢిల్లీకి చెందిన జావేద్ అబీది సంస్థ నుంచి కావ్య మూడేళ్ల ఫెలోషిప్ పొందింది. దివ్యాంగుల సంక్షేమం, వారి హక్కుల కోసం అనేక సెమినార్లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందిస్తోంది. ప్రస్తుతం కావ్యపూర్ణిమ ఆంధ్రా, గీతం యూనివర్సిటీలతో పాటు యూఎస్ఏ, కెనడా లాంటి అంతర్జాతీయ యూనివర్సిటీలు, ఐఐటీ రూర్కీలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో పలు అంశాలపై అతిథి ఉపన్యాసాలు (గెస్ట్ లెక్చర్లు) ఇస్తూ ఆర్థిక భరోసా పొందుతూ తనకాళ్లపై తాను నిలబడి ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉంది.

క్రైం... crime news

రైల్వే స్టేషన్‌లో 8.8 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.44 వేల విలువ చేసే 8.8 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తెలంగాణాకు చెందిన కాసుల వెంకటకృష్ణ (21), రామనాతి నాగ భైరవ (25) అనే నిందితులు రైల్లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడిని చేర్చిన పోలీసులు

పెందుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కిరాణా సరుకులు తెమ్మని డబ్బులు ఇస్తే నూడిల్స్ తినేయంతో తల్లిదండ్రులు కోపగించుకుంటారని భయపడి రాత్రంతా పార్క్‌లో ఉండిపోయిన బాలుడిని పోలీసులు వారి చెంతకు చేర్చారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట సమీపంలోని అప్పన్నపాలానికి చెందిన జెట్టి నారాయణమ్మ తన కుమారుడికి ఇంట్లో సరుకులు తెమ్మని చెప్పి బుధవారం రాత్రి డబ్బులు ఇచ్చింది. ఆ బాలుడు ఆ డబ్బులతో ఒక హోటల్‌లో నూడిల్స్ తిన్నాడు. ఇంటికి వెళితే తిడతారన్న భయంతో హనుమంతవాక జంక్షన్‌లోని ఓ పార్క్‌లో నిద్రపోయాడు. కుమారుడు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఎంత వెదికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తక్షణం స్పందించి రాత్రి గస్తీ పోలీసులను అలర్ట్ చేశారు. రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం హనుమంతవాక జంక్షన్‌లోని పార్క్‌లో నిద్రిస్తున్న బాలుడిని గుర్తించి, సురక్షితంగా పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చారు. గురువారం తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు పోలీసులు చేర్చారు.

టీడీపీలోకి పాశర్ల ప్రసాద్?

సింహాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ టీడీపీలో చేరనున్నారు. గత ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడిన ఆయన టీడీపీకి రాజీనామా చేశారు. తరువాత ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ ప్రత్యేక పరిశీలకుడిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన మళ్లీ టీడీపీలో చేరడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పాశర్లకు పార్టీలో చేరడానికి దాదాపుగా లైన్ క్లియర్ అయినట్టు స్థానికంగా చర్చ జరుగుతోంది.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు
- బీచ్‌రోడ్డులో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు, జూన్ 5, (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపు దిద్దుతామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరిందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్కే బీచ్ వద్ద అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపుదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు విశాఖ జిల్లాలో దాదాపు 5 లక్షల మొక్కలను నాటే కార్యక్రమం చేపటనున్నట్టు తెలిపారు. జిల్లాలో తొలి విడతలో భాగంగా మిలియన్ ప్లస్ మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు, అటవీశాఖ, జీవీఎంసీ, హార్టికల్చర్, డ్వామా తదితర ప్రభుత్వ శాఖల ద్వారా పది లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వినియోగానికి పూర్తిగా స్వస్తి పలికి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరంగా పెట్టాలని సూచించారు. గుడ్డ లేదా నార సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల మన కళ్లకు కనపడని హాని జరుగుతుందని, అంతే కాకుండా క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు మూల కారణం అవుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల సముద్ర జీవరాశులకు కూడా ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. అనంతరం ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇందిరా గాంధీ జూ పార్కు క్యూరేటర్ మంగమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పలువురు అధికారులు


మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

నేటి నుంచి మూడో విడత చందనం అరగదీత

సింహాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి మూడో విడత సమర్పించనున్న సిరి చందనం అరగదీత శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. ఏడాదిలో 4 విడతలుగా ప్రతిసారి మూడేసి మణుగులు (125 కిలోలు) చొప్పున స్వామి వారికి చందనం సమర్పిస్తారు. ఇప్పటికే రెండు విడతలు పూర్తవ్వగా, 3వ విడతగా ఈ నెల 11న చందనం సమర్పిస్తారు.


తెన్నేటి పార్కు వద్ద జోరుగా కురుస్తున్న వర్షం


ఎంవీపీ కాలనీ సెక్టార్-2 మెయిన్ రోడ్డుపై కూలిన చెట్టు


ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద చెట్టు నేలకూలిన దృశ్యం

భిన్న వాతావరణం

నగరంలో గురువారం విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో నగరవాసులు అల్లాడిపోయారు. మధ్యాహ్నానికి వాతావరణం అగ్నిగుండంలా మారడంతో ఇళ్లల్లో ఉన్న ప్రజలు సైతం వేడిమితో ఉక్కిరిబిక్కిరైపోయారు. ఆ తరువాత ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మేశాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

- డీఆర్వో భవానీశంకర్

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ అన్నారు. గురువారం ఉదయం నిర్వహించిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల కార్మిక రహిత విశాఖ కోసం అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలన్నారు. బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం 1986, సవరణ చట్టం-2016 మేరకు సెక్షన్ మూడు కింద ఏ వృత్తిలోనైనా 14 నుంచి 18 ఏళ్లలోపు బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకుని పని చేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. యాక్సిస్ టూ జస్టిస్ అప్‌హోల్డ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ జి.డేవిడ్‌రాజు మాట్లాడుతూ పాఠశాలలు మానేసిన పిల్లలే బాల కార్మికులుగా పని చేస్తున్నారని, వారిని తిరిగి బడిలో చేర్పించి చదువుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీత, మహిళా, శిశు సంక్షేమశాఖ నోడల్ ఆఫీసర్ శారదాదేవి, డీసీపీవో మమత, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీపై దృష్టిసారించాలి

కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభ సమయంలో ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ల పంపిణీపై దృష్టిసారించాలని, ఎక్కడా అలసత్వం వద్దని కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి అధికారులకు ఆదేశించారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన డీఈవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి కిట్‌లో మొత్తం ఎనిమిది ఐటెమ్స్‌ను అందించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు యాజమాన్యాలతో మాట్లాడాలన్నారు. ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంతో ఎంఈవోలు భాగస్వాములు కావాలన్నారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా ఏపీసీ జె.చంద్రశేఖర్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీకి సహకారాన్ని అందించండి

- ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎండీని కోరిన కోన తాతారావు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆర్థిక పరిపుష్టికి, రైతుల సంక్షేమానికి సహకారాన్ని అందించాలని ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎండీ డాక్టర్ ఆర్.శ్రీనాథరెడ్డిని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు కోరారు. పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గురువారం ఆయన విజయవాడలో ఆప్కాబ్ ఎండీని కలిసి డీసీసీబీ అభివృద్ధి నిర్వహణపై చర్చించారు. అలాగే బ్యాంక్ సీఈవో డీవీఎస్ వర్మను కూడా కలిశారు.


ఆప్కాబ్ ఎండీని మర్యాదపూర్వకంగా కలిసిన కోన తాతారావు

ఐటీఐ కౌన్సెలింగ్ ప్రారంభం

- తొలి రోజు 479 ర్యాంకు వరకు సీట్ల భర్తీ

కంచరపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో గురువారం నుంచి ప్రారంభించిన కౌన్సెలింగ్‌లో తొలి రోజైన గురువారం వివిధ ఐటీఐల్లో 185 మందికి సీట్లను కేటాయించినట్టు కన్వీనర్ జె.శ్రీకాంత్ తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా తొలిరోజు మొదటి ర్యాంకు నుంచి 479 ర్యాంకు వరకు అభ్యర్థులను పిలవగా, 226 మంది హాజరయ్యారు. మెరిట్ ప్రాతిపదికన ఎలక్ట్రికల్, ఫిట్టర్, మెకానికల్ తదితర ట్రేడుల్లో 185 మందికి జిల్లాలో గల వివిధ ఐటీఐల్లో సీట్లను కేటాయించినట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతు అభ్యర్థులు వారికి సూచించిన సమయానికి గంటముందే కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. అన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు మాస్కు, శానిటైజర్‌తో హాజరు కావాలని కోరారు. కాగా శుక్రవారం 480 నుంచి 1041వ ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాంకర్‌కు సీటు కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్, అధికారులు

ఏయూ ముఖద్వారం బీమ్ తొలగింపు


బీమ్ తొలగింపు పనుల్లో నిమగ్నమైన కార్మికులు

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ముఖద్వారం బీమ్‌ను తొలగించే పనిని అధికారులు గురువారం చేపట్టారు. దీనికి పగుళ్లు ఏర్పడడంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని భావించిన అధికారులు దీనిని తొలగించారు. ఇక్కడ నూతన బీమ్‌ను నిర్మించాలా.? లేక అలాగే వదిలేయాలా అనే అంశంపై అధికారులు యోచిస్తున్నారు. ఏయూ నుంచి లోపలకు వెళ్లే కొన్ని భారీ వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఉండాలంటే బీమ్‌ను నిర్మించకపోవడమే మంచిదన్న భావనలో వర్సిటీ అధికారులు ఉన్నారు. ఇదే విషయాన్ని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు వెల్లడించారు. కాగా ఈ ముఖద్వారాన్ని సుమారు 27 ఏళ్ల కిందట నిర్మించారు.